




# పోరు తెలంగాణ
డిజిటల్ తెలుగు దినపత్రిక








కరీంనగర్ సంపుటి : 11 సంచిక : 322 ఆదివారం 04-10-2026 ఎడిటర్ : కొండ ప్రవీణ్ కుమార్ పేజీలు : 04 వెల : 04


## సీఎం రేవంత్ రెడ్డి సోదరులపై కేటీఆర్ సంచలన ఆరోపణలు



- సీఎం సోదరులు షెల్ కంపెనీలతో లబ్ధి పొందుతున్నారని కేటీఆర్ ఆరోపణ
- టెసరాక్ కంపెనీకి రూ.200 కోట్ల విలువైన భూమి కేటాయించారని విమర్శ
- కేవలం లక్ష రూపాయల మూలధనంతో కంపెనీ ఏర్పాటు చేశారని వెల్లడి
- రేవంత్ సోదరులకు షెల్ కంపెనీలు.. భారీగా లబ్ధి: కేటీఆర్ సంచలన ఆరోపణలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు నామమాత్రపు అర్హతలతో భారీ కంపెనీలను రిజిస్టర్ చేస్తూ.- మిగతా 2 లో

## పాఠశాలల్లో అల్పాహార పథకం
# సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

- డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా అల్పాహార పథకం ప్రారంభం
- సెంట్రలైజ్డ్ కిచెన్ల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌తో ఒప్పందాలు
- నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో వంటశాలల కోసం ముందుకొచ్చిన ప్రైవేటు సంస్థలు
- నవంబర్ 30 కల్లా ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎం రేవంత్ ఆదేశం
- ఆహార నాణ్యత పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచన




ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అమలు చేయనున్న అల్పాహార పథకం ఏర్పాట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేగవంతం చేశారు. డిసెంబర్ 9వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రారంభించేందుకు వీలుగా నవంబర్ 30 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పథకంలో భాగంగా సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు సంబంధించిన ఒప్పందాలు నేడు ముఖ్యమంత్రి సమక్షంలో జరిగాయి. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో, అత్యాధునిక వంటశాలల

## పింగళి వెంకయ్యకు ఇచ్చే నిజమైన గౌరవం భారతరత్న మాత్రమే



- భారత జాతీయ పతాకాన్ని రూపొందించిన మహనీయుడు పింగళి వెంకయ్య అన్న వీహెచ్
- భారతరత్న ఇవ్వడం ద్వారానే ఆయనకు నిజమైన గౌరవం లభిస్తుందని వ్యాఖ్య

పింగళి సేవలను మోదీ ఎందుకు విస్మరిస్తున్నారో అని ప్రశ్న భారత జాతీయ పతాకాన్ని - మిగతా 2 లో

## ఇద్దరు పాక్ చొరబాటుదారులను
# కాల్చి చంపిన బీఎస్ఎఫ్ బలగాలు

- పంజాబ్ సరిహద్దులో ఇద్దరు పాకిస్థానీ చొరబాటుదారులు హతం
- టార్న్ టారన్ జిల్లాలో చొరబాటు యత్నాన్ని భగ్నం చేసిన బీఎస్ఎఫ్
- హెచ్చరికలు పట్టించుకోకపోవడంతో కాల్పులు జరిపిన దళాలు




పంజాబ్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఇద్దరు పాకిస్థానీ చొరబాటుదారులను సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) ఈరోజు కాల్చి చంపింది. భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించేందుకు వారు చేసిన

## చరిత్ర మన్మోహన్ సింగ్‌ను గౌరవంగా గుర్తుంచుకుంటుంది



- బొగ్గు కుంభకోణం కేసు క్లీన్ చిట్‌పై సోనియా గాంధీ
- మన్మోహన్ పై రాజకీయ దుష్ప్రచారాలకు తెరపడిందన్న సోనియా
- విచారణ కోర్టు తీర్పును సుప్రీంకోర్టు తప్పుపట్టడాన్ని స్వాగతించిన సోనియా
- సీబీఐ, ఈడీ వంటి సంస్థలను రాజకీయాలకు వాడుకుంటున్నారని మండిపాటు

బొగ్గు బ్లాకుల కేటాయింపు కేసులో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సుప్రీంకోర్టు క్లీన్ - మిగతా 2 లో

## గాంధీకి వ్యతిరేకంగా ఉన్న గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి

- గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి
- గాడ్సే భావజాలాన్ని ప్రతిఒక్కరూ తిప్పికొట్టాలని పిలుపు
- గాంధీ ఆశయాల స్ఫూర్తితోనే తమ ప్రజా ప్రభుత్వం పాలన
- అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా స్కూళ్ల ఏర్పాటు
- వివక్ష లేని సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టీకరణ



## హస్త కళాకారులకు
# అండగా ప్రభుత్వం



- హస్త కళాకారులకు నాణ్యమైన కలప సరఫరాపై పవన్ సమీక్ష
- కేవలం నిర్వహణ ఖర్చులకే కలప అందించాలని ఆదేశం
- రాష్ట్రంలోని ఆరు ప్రాంతాల్లో క్రాఫ్ట్ వుడ్ బ్యాంకుల ఏర్పాటుకు చర్యలు
- దళారుల వ్యవస్థను నిర్మూలించి, కళాకారులకు అండగా నిలవడమే లక్ష్యం

రాష్ట్రంలోని సంప్రదాయ హస్తకళాకారులకు అండగా నిలిచేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక - మిగతా 2 లో

## కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి హరీశ్ రావు లేఖ




- టీజీ ట్రాన్స్‌కోలో 26 శాతం వాటాల విక్రయాన్ని ఆపాలని వినతి
- ఇది విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు తొలి అడుగని ఆందోళన
- కాంగ్రెస్ జాతీయ విధానాలకు ఇది విరుద్ధమని లేఖలో ప్రస్తావన
- ప్రైవేటీకరణపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్న ట్రాన్స్‌కో

తెలంగాణలోని కీలక విద్యుత్ రంగ సంస్థల్లో

## పరుగులు పెడుతున్న ఏపీ ఆర్థిక వ్యవస్థ
# జాతీయ సగటు కంటే మెరుగైన వృద్ధి

- జాతీయ సగటును మించి ఏపీ ఆర్థిక వృద్ధి నమోదు
- 2025-26లో 9.9 శాతానికి చేరిన రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధి రేటు
- వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో గణనీయమైన ప్రగతి
- ఎల్ నినో ప్రభావంపై సీఎం చంద్రబాబు ఆందోళన
- సంక్షోభంలోనూ 15% వృద్ధి లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు ఆదేశం




ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధి పథంలో పయనిస్తోంది. జాతీయ వృద్ధి రేటును అధిగమించి, వరుసగా రెండో ఏడాది కూడా రాష్ట్రం మెరుగైన ప్రగతిని నమోదు చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి (+జాబా) వృద్ధి రేటు 9.9 శాతానికి చేరుకున్నట్లు జులై 2026 నెలవారీ ఆర్థిక నివేదిక స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు నాయుడుకు ప్రణాళికా విభాగం

## ఆంక్షలు విధించడం అమెరికాకు వ్యసనంగా మారింది

- ఇరాన్ విదేశాంగ శాఖ తీవ్ర వ్యాఖ్యలు
- అమెరికా ఆర్థికమంత్రి వ్యాఖ్యలపై మండిపడ్డ ఇరాన్



లక్ష్యాలను సాధించడంలో విఫలమైనప్పుడల్లా ఆంక్షల అస్త్రాలను ప్రయోగిస్తోందని మండిపాటు

ఆంక్షల బెదిరింపులతో తమను లొంగదీసుకోలేరని వ్యాఖ్య

ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలపై, ముఖ్యంగా తమ దేశంపై ఆర్థిక ఆంక్షలు విధించడం అమెరికాకు ఒక అలవాటుగా, చివరకు వ్యసనంగా మారిపోయిందని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆంక్షల ద్వారా ఇరాన్‌ను 'ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాం'- మిగతా 2 లో

## యుద్ధ నేరాల కేసులో సిరియా మాజీ అధ్యక్షుడు అసద్‌కు మరణశిక్ష

- బషర్ అల్ అసద్‌కు మరణశిక్ష
- అసద్ తమ్ముడు మహెర్‌కూ అదే శిక్ష
- సమీప బంధువు అతీఫ్ నజీబ్‌కూ మరణశిక్ష
- యుద్ధ నేరాలు, మానవ హక్కుల ఉల్లంఘనల నేరాలపై తీర్పు
- చిన్నారుల హత్య, హింసతో దోషిగా తేలిన నజీబ్



సిరియా మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్‌కు మరణశిక్ష విధించారు. 14 ఏళ్ల సిరియా అంతర్యుద్ధం సమయంలో జరిగిన యుద్ధ నేరాలు, మానవ హక్కుల హననానికి సంబంధించిన కేసులో ఆయన్ను దోషిగా తేల్చిన కోర్టు కఠిన- మిగతా 2 లో

## ఇద్దరు పాక్ చొరబాటుదారులను కాల్చి చంపిన బీఎస్ఎఫ్ బలగాలు

మొదటిపేజీ తరువాయి - ప్రయత్నాన్ని బీఎస్ఎఫ్ దళాలు సమర్థవంతంగా భగ్నం చేశాయి. ఈ ఘటనలో మరో చొరబాటుదారుడు పాకిస్థాన్ వైపు తిరిగి పారిపోయినట్లు అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే, టార్న్ టారన్ జిల్లాలోని ఖల్రా సెక్టార్ పరిధిలో ఉన్న రాజోకే బోర్డర్ అవుట్‌పోస్ట్ (బీఓపీ) సమీపంలో ఈ ఘటన జరిగింది. పాకిస్థాన్ వైపు నుంచి ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా భారత భూభాగం వైపు వస్తుండటాన్ని బీఎస్ఎఫ్ సిబ్బంది గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన దళాలు, ముందుకు రావొద్దని వారిని హెచ్చరించాయి. అయితే, పలుమార్లు హెచ్చరించినా వారు పట్టించుకోకుండా ముందుకు సాగడంతో బీఎస్ఎఫ్ కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. మరణించిన వారిని ఇంకా అధికారికంగా గుర్తించలేదు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పంజాబ్ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులతో కలిసి బీఎస్ఎఫ్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలంలో సోదాలు కొనసాగుతున్నాయి.

## హస్త కళాకారులకు అండగా ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి - నిర్ణయం తీసుకుంది. వారికి అవసరమైన నాణ్యమైన కలపను ఎటువంటి లాభాపేక్ష లేకుండా, అసలు ధరకే అందించాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో 'క్రాఫ్ట్ వుడ్ బ్యాంకుల' ఏర్పాటుపై సోమవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. కలప సేకరణ, రవాణా, నిల్వకు అయ్యే వాస్తవ వ్యయాన్ని మాత్రమే వసూలు చేస్తూ చేతివృత్తుల వారికి ముడిసరుకును సరఫరా చేయాలని స్పష్టం చేశారు. ముడిసరుకు కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కళాకారులకు ఈ వుడ్ బ్యాంకులు ఒక భరోసాగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ప్రక్రియలో దళారుల ప్రమేయాన్ని పూర్తిగా తొలగించడం ద్వారా కళాకారుల ఉత్పత్తి వ్యయం తగ్గి, వారికి ఆర్థిక భరోసా లభిస్తుందని వివరించారు. రాష్ట్రంలోని కొండపల్లి, ఏటికొప్పాక, సెట్టిగుంట, మాధవమాల, ఉదయగిరి, బొబ్బిలి వంటి ఆరు ప్రధాన కేంద్రాల్లో ఈ క్రాఫ్ట్ వుడ్ బ్యాంకులను ఏర్పాటు చేయనున్నారు. కొండపల్లి బొమ్మలకు అవసరమైన తెల్లపొనికి, ఏటికొప్పాక హస్తకళలకు వినియోగించే అంకుడు, బొబ్బిలి వీణల తయారీకి వాడే పనస, రోజ్‌వుడ్ వంటి కలపను ఈ బ్యాంకుల ద్వారా సరఫరా చేస్తారు. అలాగే, రాజమండ్రి సెంట్రల్ వుడ్ బ్యాంకులో వెదురు, టేకు వంటివి అందుబాటులో ఉంటాయి. అరుదైన కలప జాతుల లభ్యతను మ్యాపింగ్ చేసి, వాటిని అటవీ నర్సరీలలో సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని పవన్ అధికారులను ఆదేశించారు.

## సీఎం రేవంత్ రెడ్డి సోదరులపై కేటీఆర్ సంచలన ఆరోపణలు

మొదటిపేజీ తరువాయి - రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పెద్ద ఎత్తున లబ్ధి పొందుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి సోదరులు బడా కంపెనీలకు యజమానులుగా మారుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. కనీసం ఒక్క ఉద్యోగి కూడా లేని కంపెనీలను చిన్న నివాసాల చిరునామాలతో రిజిస్టర్ చేయించారని పేర్కొన్నారు. అటువంటి ఒక కంపెనీకే దాదాపు రూ. 200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని ప్రభుత్వం కట్టబెట్టిందని విమర్శించారు. ముఖ్యంగా, అనుముల కొండల్ రెడ్డి తన లింక్డ్ఇన్ ప్రొఫైల్‌లో 'టెసరాక్' కంపెనీకి ఛైర్మన్‌గా ఉన్నట్లు పేర్కొన్నారని తెలిపారు. మరో సోదరుడు జగదీశ్ రెడ్డి కాంట్రాక్టులు దక్కించుకుంటుండగా, ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డికి సింగరేణిలో కాంట్రాక్ట్ కట్టబెట్టారని ఆరోపించారు. ప్రతిపాదిత ఫోర్త్ సిటీ పరిధిలోని భూముల కేటాయింపులపై బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ ఒకరోజు ముందే ఇవే తరహా ఆరోపణలు చేసిన నేపథ్యంలో కేటీఆర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కొండల్ రెడ్డి ఛైర్మన్‌గా ఉన్న టెసరాక్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మహేశ్వరం మండలం రావిర్యాలలో సుమారు ఐదు ఎకరాల భూమిని కేవలం రూ. 7 కోట్లకు కేటాయించారని, దాని అసలు మార్కెట్ విలువ రూ. 100 కోట్లకు పైగా ఉంటుందని క్రిశాంక్ పేర్కొన్నారు. ఆ కంపెనీకి కేవలం రూ.లక్ష మూలధనం ఉందని, పటాన్‌చెరులోని ఒక చిన్న నివాసం నుంచి కార్యకలాపాలు సాగిస్తోందని ఆరోపించారు. కాగా, క్రిశాంక్ చేసిన ఆరోపణలను మంత్రి డి.శ్రీధర్ బాబు తీవ్రంగా ఖండించారు.

## గాంధీకి వ్యతిరేకంగా ఉన్న గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి

మొదటిపేజీ తరువాయి - గాంధీ జయంతిని పురస్కరించుకుని జాతిపిత మహాత్మా గాంధీకి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఘన నివాళులర్పించారు. గాంధీజీ ఆశయాల స్ఫూర్తితోనే రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, వివక్ష లేని సమాజ నిర్మాణమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గాడ్సే భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ, స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను వక్రీకరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ ఐక్యంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. సత్యం, అహింస, శాంతి మార్గాల ద్వారా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేలా చేసిన గాంధీజీ ఆశయాలు సదా స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గాంధీజీ చూపిన మార్గంలోనే తమ ప్రభుత్వం పయనిస్తోందని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా విద్యార్థులందరికీ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యను అందించాలనే ఉద్దేశంతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల'ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వివక్షకు తావులేని సమసమాజ నిర్మాణమే ప్రజా పాలన అంతిమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'.. భారీ పెట్టుబడులే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి - దృష్టి పెట్టాలని సూచించారు. వివిధ వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులను సదస్సులో సత్కరించేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. సంస్థాగత ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. గత ఏడాది సదస్సు తర్వాత తెలంగాణకు వచ్చిన పెట్టుబడులు, వాటి పురోగతిపై వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని మరిన్ని పెట్టుబడులు సాధించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఇదే సమావేశంలో హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 పనులపైనా సీఎం సమీక్షించారు. పాతబస్తీలో ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మార్గంలో రోడ్డు విస్తరణ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మెట్రో పనులకు టెండర్ల ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. పెండింగ్ భూసేకరణను పూర్తి చేసి విస్తరణ ప్రణాళికలను ఖరారు చేయాలని చెప్పారు. హైదరాబాద్ మెట్రోలో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు సమకూర్చుకోవాలని అధికారులను ఆదేశించారు. పాతబస్తీ మెట్రో మార్గంలో అనుసరించాల్సిన సాంకేతికతపై ఢిల్లీ మెట్రో అధికారులతో సంప్రదించాలని సూచించారు.

## కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి హరీశ్ రావు లేఖ

మొదటిపేజీ తరువాయి - వాటాల విక్రయం లేదా ప్రైవేటీకరణ ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి లేఖ రాశారు. టీజీ ట్రాన్స్‌కోలో 26 శాతం వాటాలను ఐపీఓ ద్వారా విక్రయించి నిధులు సమీకరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో కాంగ్రెస్ జాతీయ నాయకత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజాధనంతో నిర్మితమైన టీజీ ట్రాన్స్‌కో, రాష్ట్ర విద్యుత్ సరఫరా వ్యవస్థకు వెన్నెముక వంటిదని హరీశ్ రావు తన లేఖలో పేర్కొన్నారు. వేలాది కిలోమీటర్ల మేర విస్తరించిన విద్యుత్ లైన్లు, హై-వోల్టేజ్ సబ్‌స్టేషన్లతో కూడిన ఈ సంస్థ అత్యంత విలువైన ఆస్తి అని వివరించారు. ట్రాన్స్‌కోలో ప్రైవేట్ వాటాలకు అనుమతినిస్తే, భవిష్యత్తులో టీజీ జెన్‌కో, సింగరేణి, డిస్కమ్‌ల ప్రైవేటీకరణకు కూడా ఇది మార్గం సుగమం చేస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం కాంగ్రెస్ పార్టీ 2019 ఎన్నికల మేనిఫెస్టో, 2023 రాయ్‌పూర్ తీర్మానాలకు విరుద్ధమని హరీశ్ రావు ప్రశ్నించారు. వ్యూహాత్మకంగా ప్రాధాన్యత లేని, నష్టాల్లో ఉన్న సంస్థల్లో మాత్రమే పెట్టుబడుల ఉపసంహరణకు కట్టుబడి ఉన్నామని గతంలో కాంగ్రెస్ ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసీ వంటి సంస్థలను ప్రైవేటీకరిస్తుంటే తీవ్రంగా వ్యతిరేకించిన కాంగ్రెస్, రాష్ట్రంలో అధికారంలోకి రాగానే అందుకు భిన్నంగా వ్యవహరించడం ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని నిలదీశారు. విద్యుత్ సంస్థల యాజమాన్య హక్కులపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, ప్రైవేటీకరణ, వాటాల విక్రయం లేదా పబ్లిక్ ఇష్యూపై ఇప్పటి వరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని టీజీ ట్రాన్స్‌కో వర్గాలు వెల్లడించాయి.

## పాఠశాలల్లో అల్పాహార పథకం.. సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

మొదటిపేజీ తరువాయి - ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌కు మద్దతుగా జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు ముందుకొచ్చాయి. నాగర్‌కర్నూల్‌లో కిచెన్ ఏర్పాటుకు జున్నా సోలార్ సిస్టమ్స్ తరఫున సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈఓ అనిల్ బాబు రూ. 5.17 కోట్ల చెక్కును, వికారాబాద్‌లో కిచెన్ ఏర్పాటుకు చైన్ ల్యాబ్స్ ఇండియా తరఫున ప్రతినిధి డి. సుమంత్, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ రూ. 4 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి చేతుల మీదుగా హరేకృష్ణ ఫౌండేషన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు అందించే ఆహారంలో కేలరీలను లెక్కించేందుకు ప్రత్యేక యాప్‌లను వినియోగించాలని సూచించారు. స్థానిక ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మెనూ ఉండాలని, ఆహార నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం దీర్ఘకాలం కొనసాగేలా సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని ఆదేశించారు.

## పరుగులు పెడుతున్న ఏపీ ఆర్థిక వ్యవస్థ.. జాతీయ సగటు కంటే మెరుగైన వృద్ధి

మొదటిపేజీ తరువాయి - అధికారులు ఈ నివేదికను సమర్పించారు. నివేదిక ప్రకారం, వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో రాష్ట్రం గణనీయమైన వృద్ధిని సాధించింది. 2025-26 రెండో త్రైమాసికంలో వ్యవసాయ రంగం 13.5 శాతం, పారిశ్రామిక రంగం 10.6 శాతం, సేవా రంగం 9.9 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ముఖ్యంగా సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి 304 శాతం, వాణిజ్య వాహనాల విక్రయాలు 51.6 శాతం, ఎస్‌టిపిఐ (ఆ్యూ×) ఎగుమతులు 32.2 శాతం మేర పెరిగాయి. సాంకేతికత వినియోగం ద్వారా జీఎస్టీ వసూళ్లు 21 శాతం వృద్ధితో రూ.13,282 కోట్లకు చేరాయి. రాష్ట్రంలోకి పెట్టుబడుల ప్రవాహం కూడా ఆశాజనకంగా ఉంది. రూ. 2.88 లక్షల కోట్ల విలువైన మెగా ప్రాజెక్టుల పెట్టుబడుల్లో 75.4 శాతం మేర గ్రౌండింగ్ పూర్తయింది. ఈ నివేదికను సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్రం ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదైందని, కృష్ణా నదిలో నీటి లభ్యత లేక శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రధాన ప్రాజెక్టులు నిండలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి సంక్షోభ పరిస్థితుల్లోనూ రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలు దెబ్బతినకుండా పటిష్ఠమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రం 15 శాతం వృద్ధి రేటును సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం స్పష్టం చేశారు. అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ప్రజలపై ధరల భారం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా, నియోజకవర్గం, మండలాల వారీగా నివేదికలు రూపొందిస్తే లక్ష్యాల సాధన సులభమవుతుందని పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక, ప్రణాళికా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శాంతిభద్రతలపై సీఎం చంద్రబాబు సమీక్ష 1300 మంది పోలీసులతో కీలక భేటీ రేపు శాంతిభద్రతలపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష డీజీపీ నుంచి ఎస్‌హెచ్‌ఓ వరకు 1300 మంది అధికారులతో సమావేశం గంజాయి, సైబర్ క్రైమ్, మహిళలపై నేరాల కట్టడిపై ప్రధానంగా చర్చ పోలీస్ స్టేషన్ల పనితీరుపై నివేదికలతో సమీక్షించనున్న ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం 3:30 గంటలకు సచివాలయంలో కీలకమైన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నారు. రాష్ట్ర పోలీస్ శాఖ చరిత్రలోనే అరుదుగా, డీజీపీ స్థాయి అధికారి నుంచి క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) వరకు సుమారు 1,300 మంది అధికారులు ఈ సమావేశంలో పాల్గొనబోతుండటం గమనార్హం. ఈ సమీక్షా సమావేశంలో ప్రధానంగా రాష్ట్రంలోని శాంతిభద్రతలు, మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాల నియంత్రణ, సైబర్ నేరాలు, సోషల్ మీడియా వేదికగా సాగుతున్న దుష్ప్రచారాలు, గంజాయి నిర్మూలన, బ్లేడ్ బ్యాచ్‌ల అరాచకాలకు అడ్డుకట్ట వేయడం వంటి కీలక అంశాలపై చంద్రబాబు చర్చించనున్నారు. పోలీస్ స్టేషన్ల పనితీరుపై తన వద్ద ఉన్న క్షేత్రస్థాయి నివేదికలను అధికారుల ముందుంచి, ఆయన సమగ్రంగా విశ్లేషించనున్నారు. వివిధ స్టేషన్లలో నమోదవుతున్న కేసులు, శాంతిభద్రతల పర్యవేక్షణ తీరుతెన్నులపై ముఖ్యమంత్రి నేరుగా సమీక్ష నిర్వహించనున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై, చట్టాన్ని అతిక్రమించే వారిపై ఉక్కుపాదం మోపాలని, మహిళలు, బలహీన వర్గాల రక్షణకే అత్యంత ప్రాధాన్యతనివ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సందర్భంగా పోలీసు యంత్రాంగానికి స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నారు. సచివాలయంలో జరిగే ఈ సమావేశానికి పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యక్షంగా హాజరవుతుండగా, జిల్లా స్థాయి అధికారులు, ఎస్‌హెచ్‌ఓలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొంటారు.

## చరిత్ర మన్మోహన్ సింగ్‌ను గౌరవంగా గుర్తుంచుకుంటుంది



మొదటిపేజీ తరువాయి - చిట్ ఇవ్వడం చారిత్రాత్మక ఘట్టమని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ పేర్కొన్నారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికకు ఆమె రాసిన ప్రత్యేక వ్యాసంలో... సుప్రీంకోర్టు తీర్పుతో మన్మోహన్ సింగ్‌పై ఇన్నాళ్లూ జరిగిన రాజకీయ కక్షసాధింపులకు, దుష్ప్రచారాలకు తెరపడిందని స్పష్టం చేశారు. "నాడు (2014 జనవరిలో) మన్మోహన్ సింగ్ చెప్పినట్లుగానే చరిత్ర ఆయన పట్ల చాలా దయతో, గౌరవంగా ప్రవర్తిస్తుంది" అని ఆమె గుర్తుచేశారు. సీబీఐ దాఖలు చేసిన క్లోజర్ నివేదికను ఆమోదిస్తూ, విచారణ పరిధి దాటి వ్యాఖ్యలు చేసిన విచారణ కోర్టు తీరును సుప్రీంకోర్టు తప్పుపట్టడాన్ని సోనియా గాంధీ స్వాగతించారు. మన్మోహన్ సింగ్ సమగ్రతను, మచ్చలేని రాజకీయాన్ని దెబ్బతీసేందుకు అప్పట్లో రాజకీయ ప్రత్యర్థులు, కొందరు అధికారులు మరియు మీడియా ప్రణాళికాబద్ధంగా కుట్ర పన్నారని ఆరోపించారు. ప్రస్తుత మోదీ ప్రభుత్వంపై మండిపడుతూ... సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను రాజకీయ అవసరాలకు వాడుకుంటున్నారని విమర్శించారు. యూపీఏ హయాంలో సాధించిన ఆర్థిక పురోగతి, ఉపాధి హామీ, విద్యా హక్కు, ఆహార భద్రత చట్టాల ప్రాధాన్యతను వివరిస్తూ.. మన్మోహన్ సింగ్ ప్రశాంతంగా ఉన్నప్పటికీ దేశానికి అత్యంత కీలకమైన సేవలు అందించిన ప్రధానిగా నిలిచిపోతారని కొనియాడారు.

## ఇన్‌స్టాగ్రామ్‌లో మోదీ కొత్త రీల్ ఈసారి యువతకు ప్రధాని స్పెషల్ ఛాలెంజ్



మొదటిపేజీ తరువాయి - చేతితో నేసిన వస్త్రాలను ధరించి సోషల్ మీడియాలో "+వ్ =ముంఎ ఔఝ్ష్ట వీవ (+=ఔవీ)" వీడియోలు రూపొందించి పంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా భారతీయ చేనేత సంప్రదాయాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు, చేనేత కార్మిక కుటుంబాలకు ఆర్థికంగా తోడ్పాటు అందించవచ్చని పేర్కొన్నారు. జాతీయ చేనేత దినోత్సవానికి ముందు రోజు అయిన గురువారం ప్రధాని మోదీ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఒక ప్రత్యేక రీల్‌ను విడుదల చేశారు. అందులో ఆగస్టు 7 తేదీకి ఉన్న చారిత్రక ప్రాధాన్యాన్ని గుర్తు చేశారు. 1905 ఆగస్టు 7న స్వదేశీ ఉద్యమం ప్రారంభమైందని, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రజలు స్వదేశీ వస్తువులను ప్రోత్సహిస్తూ ఐక్యంగా ముందుకు వచ్చిన రోజు ఇదేనని వివరించారు. ఇటీవల దేశవ్యాప్తంగా యువత ఫ్రెండ్‌షిప్ డేను ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారని గుర్తు చేసిన ప్రధాని, అదే ఉత్సాహంతో ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని కూడా నిర్వహించాలని కోరారు. భారతీయ చేనేతకు సంబంధించిన అవగాహన పెంచడం, సంప్రదాయ నైపుణ్యాలను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. భారతదేశంలోని చేనేత కుటుంబాలు తమ చేతులతో అద్భుతమైన వస్త్రాలను తయారు చేస్తున్నాయని ప్రధాని మోదీ కొనియాడారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో లభించే చేనేత వస్త్రాల వైవిధ్యం, కళాత్మకత ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందాయని పేర్కొన్నారు. ఈ దినోత్సవం ద్వారా వారి కృషిని గుర్తించి, వారికి మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రాచుర్యం పొందుతున్న "+వ్ =ముంఎ ఔఝ్ష్ట వీవ (+=ఔవీ)" ట్రెండ్‌ను కూడా చేనేత ప్రచారానికి వినియోగించాలని ప్రధాని సూచించారు. చేనేత దుస్తులు ధరించి +=ఔవీ వీడియో రూపొందించి సోషల్ మీడియాలో పంచుకోవాలని, తద్వారా మరింత మంది చేనేత వస్త్రాలను ఉపయోగించేలా ప్రేరేపించాలని యువతకు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి కార్యక్రమాలు దేశంలో ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనకు కూడా దోహదపడతాయని ప్రధాని అభిప్రాయపడ్డారు. చిన్న, పేద చేనేత కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని చెప్పారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక చేనేత ఉత్పత్తిని కొనుగోలు చేసి, దానికి సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో పంచుకుంటే, దేశవ్యాప్తంగా ఉన్న చేనేత కళాకారుల ప్రతిభ ప్రపంచానికి మరింత చేరువ అవుతుందని పేర్కొన్నారు. భారతీయ సంప్రదాయం, స్వదేశీ ఉత్పత్తులు, చేనేత కార్మికుల జీవనోపాధికి మద్దతు ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ ప్రత్యేక పిలుపునిచ్చిన ప్రధాని, జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రజల భాగస్వామ్యంతో మరింత అర్థవంతంగా మార్చాలని ఆకాంక్షించారు. యువత సోషల్ మీడియా శక్తిని సానుకూలంగా వినియోగించి, భారతీయ చేనేతకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు.

## మూడు రోజుల్లో క్షమాపణలు చెప్పండి

మొదటిపేజీ తరువాయి - ఈ వ్యవహారంపై బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, ఇందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పార్లమెంట్ కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కమిటీ సూచించింది. బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే నేతృత్వంలోని ఈ కమిటీ, ప్రధాని వీడియో తొలగింపును ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన చర్యగా అభివర్ణించింది. దేశ ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రధాని వీడియోను తొలగించడం తీవ్రమైన విషయంగా పేర్కొంది. మూడు రోజుల్లో చర్యలు తీసుకోకపోతే ఫేస్‌బుక్‌కు ప్రస్తుతం ఉన్న 'సేఫ్ హార్బర్' రక్షణను తొలగించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలించే అవకాశం ఉందని కమిటీ హెచ్చరించినట్టు సమాచారం. అలా జరిగితే సోషల్ మీడియా సంస్థ అధికారులపై నేరుగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసే అవకాశం ఉంటుందని తెలిపింది. జులై 23న ప్రధాని మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక సెల్ఫీ వీడియోను పోస్టు చేశారు. తర్వాత అదే వీడియోను ఫేస్‌బుక్‌లో కూడా షేర్ చేశారు. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో ప్రశ్నాపత్రాల లీకేజీపై కఠిన చర్యలు తీసుకుంటామని దాంట్లో హామీ ఇచ్చారు. అయితే ఫేస్‌బుక్‌లో ఆ వీడియో కొద్దిసేపు కనిపించకుండా పోవడంతో వివాదం చెలరేగింది. విమర్శలు రావడంతో మెటా వెంటనే ఆ పోస్టును పునరుద్ధరించింది. ఇటీవల పార్లమెంటరీ కమిటీ ఎదుట హాజరైన మెటా ప్రతినిధులు, ఇది సాంకేతిక లోపం వల్ల జరిగిందని క్షమాపణ చెప్పారు. అయితే ఐటీ శాఖ ఆ వివరణను పూర్తిగా అంగీకరించలేదు. నిజంగా సాంకేతిక లోపమే అయితే అలాంటి సమస్యలు మళ్లీ రాకుండా మెటా తన వ్యవస్థలను మెరుగుపరచాలని సూచించింది. ఇన్‌స్టాగ్రామ్‌లో చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన అసభ్యకర కంటెంట్ ప్రకటనల రూపంలో కనిపిస్తున్న వ్యవహారంపైనా మెటాపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే నోటీసు ఇచ్చింది. ఈ అంశంపై పార్లమెంటరీ కమిటీ మరోసారి హెచ్చరిక జారీ చేసింది. గూగుల్, యూట్యూబ్, ఎక్స్, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ సహా అన్ని సోషల్ మీడియా వేదికలు చిన్నారులపై లైంగిక దుర్వినియోగానికి సంబంధించిన కంటెంట్‌ను కట్టడి చేసే నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కమిటీ స్పష్టం చేసింది. ఉల్లంఘనలు జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

## ఆంక్షలు విధించడం అమెరికాకు వ్యసనంగా మారింది



మొదటిపేజీ తరువాయి - అంటూ అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ చేసిన వ్యాఖ్యలపై ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఘాటుగా స్పందించారు. దౌత్య మార్గాల్లో అనుకున్న లక్ష్యాలను సాధించడంలో విఫలమైనప్పుడల్లా అమెరికా ఈ ఆంక్షల అస్త్రాన్ని ప్రయోగిస్తోందని, అవి పనిచేయనప్పుడు మరింత తీవ్రతను పెంచుతూ తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. దశాబ్దాలుగా ఇరాన్ ప్రజలు అమెరికా విధించిన కఠినమైన ఆంక్షలను తట్టుకుని నిలబడ్డారని, కేవలం ఆంక్షల బెదిరింపులతో తమ దేశాన్ని లొంగదీసుకోవడం ఎవరికీ సాధ్యం కాదని బఘాయి స్పష్టం చేశారు. అమెరికా నాయకులు ఈ విపరీత ధోరణిని, చెడు అలవాటును ఇలాగే కొనసాగిస్తే, భవిష్యత్తులో దౌత్యపరమైన సంక్షోభాల నుంచి గౌరవప్రదంగా బయటపడే అవకాశాలను వారే స్వయంగా నాశనం చేసుకుంటారని హెచ్చరించారు. మరోవైపు, ఇరాన్ ప్రభుత్వం ఆంక్షలను అధిగమించడానికి డిజిటల్ ఆస్తులు, రహస్య బ్యాంకింగ్ నెట్‌వర్క్‌లపై ఆధారపడుతోందని అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ ఆరోపించారు. ఇరాన్ కొనసాగిస్తున్న అక్రమ ఆర్థిక వ్యవస్థలను గుర్తించి త్వరలోనే పూర్తిగా ధ్వంసం చేస్తామని వెల్లడించారు. ఇంకోవైపు, అమెరికాతో ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న వేళ ఇరాన్ సైనిక నాయకత్వంలో కీలక నియామకాలు జరిగాయి. దేశ సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన మొజ్తబా ఖమేనీ తొలిసారిగా మిలిటరీ విభాగంలో ప్రధాన మార్పులు చేశారు. సాయుధ దళాల చీఫ్‌గా మేజర్ జనరల్ అలీ అబ్దొల్లాహీని, డిప్యూటీ చీఫ్‌గా కియుమర్స్ హైదరీని నియమించారు. అలాగే శక్తివంతమైన ఇస్లామిక్ రివాల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కమాండర్‌గా మేజర్ జనరల్ అహ్మద్ వాహిదీని, ఆయన డిప్యూటీగా మోస్తఫా ఇజాదీని బాధ్యతల్లోకి తీసుకువచ్చారు. మొజ్తబా ఖమేనీ నాయకత్వంలో జరిగిన ఈ అత్యున్నత స్థాయి నియామకాలు ప్రాంతీయ రాజకీయాల్లో ప్రాధాన్యత

## యుద్ధ నేరాల కేసులో సిరియా మాజీ అధ్యక్షుడు అసద్‌కు మరణశిక్ష



మొదటిపేజీ తరువాయి - శిక్ష విధించింది. అసద్ ప్రస్తుతం దేశంలో లేకపోవడం గమనార్హం. అసద్ తమ్ముడు మహెర్ అల్ అసద్‌కు కూడా ఇదే కేసులో మరణశిక్ష పడింది. సిరియా సైన్యంలో కీలక బాధ్యతలు నిర్వహించిన ఆయన.. మాజీ పాలకుడి పాలనలో సైనిక వ్యవహారాల్లో ముఖ్య పాత్ర పోషించారు. అసద్‌కు మరో దగ్గరి బంధువు అతీఫ్ నజీబ్‌కు కూడా మరణశిక్ష విధించారు. 2011లో దక్షిణ సిరియాలోని దారా ప్రావిన్స్‌లో రాజకీయ భద్రతా విభాగానికి ఆయన అధిపతిగా ఉన్నారు. ఆ సమయంలో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలను అణచివేయడంలో కీలక పాత్ర పోషించినట్లు కోర్టు పేర్కొంది. 15 ఏళ్లలోపు చిన్నారులను ఉద్దేశపూర్వకంగా హతమార్చడం, హింసకు పాల్పడి మరణాలకు కారణం కావడం వంటి నేరాలకు నజీబ్ పాల్పడ్డారని కోర్టు నిర్ధారించింది. సిరియాలో కొత్తగా ఏర్పడిన తాత్కాలిక పాలకుల హయాంలో మాజీ ప్రభుత్వ నేతలపై జరుగుతున్న విచారణల్లో ఇది కీలక పరిణామంగా నిలిచింది. గత ప్రభుత్వంలో పనిచేసిన పలువురిపై ప్రస్తుతం కేసులు నడుస్తున్నాయి. ఇస్లామిస్ట్ నేతృత్వంలోని బలగాలు డమాస్కస్ వైపు దూసుకెళ్లడంతో 2024 డిసెంబరులో అసద్ కుటుంబంతో కలిసి సిరియా నుంచి పారిపోయారు. అనంతరం మాస్కోలో ఆశ్రయం పొందారు. మరోవైపు నజీబ్‌ను అరెస్టు చేసి విచారణకు హాజరుపరిచారు. మాజీ ప్రభుత్వంలో విచారణ ఎదుర్కొంటున్న అత్యున్నత స్థాయి అధికారుల్లో ఆయన ఒకరు.

# గ్రామ అభివృద్ధి లక్ష్యంగా గ్రామసభ సర్పంచ్ బానోత్ పద్మ





**బూర్గంపాడు సెప్టెంబర్ 3 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** పినపాక పట్టి నగర్ గ్రామంలో శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మహాత్మా గాంధీ ఫోటోకు పూలమాలేసి ఘనంగా నివాళులర్పించారు తర్వాత వి.బి.జి.రామ్ జి గ్రామసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ బానోత్ పద్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బానోత్ పద్మ మాట్లాడుతూ... గ్రామాభివృద్ధిలో గ్రామసభలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. గ్రామంలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులు, తాగునీరు, డ్రైనేజీ సమస్యలు, ఉపాధి హామీ పనులు, సంక్షేమ పథకాల అమలుపై సభలో వివరంగా చర్చించారు. గ్రామ ప్రజలందరూ భాగస్వాములై భూమి సర్వే కి గ్రామ అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు. గ్రామపంచాయతీ లో పనిచేస్తున్న పారిశుద్ధకార్మికులను సర్పంచ్ పాలకవర్గ సభ్యులు కలిసి ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, తోట మల్ల వెంకటరమణ పంచాయతీ కార్యదర్శి శ్రీమతి రాజేశ్వరి పాలకవర్గం సభ్యులు,అంగన్వాడీ టీచర్లు కార్యకర్తలు, ఆశా వర్కర్లు మరియు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గాంధీ జయంతి ఉత్సవాలలో పాల్గొన్న మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు






**మహేశ్వరం, అక్టోబర్ 3, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన టిపిసిసి, గాంధీ జ్ఞాన సంస్థాన్ ఆధ్వర్యంలో 157 వ గాంధీ జయంతి ఉత్సవాలు ఎల్బీ స్టేడియంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహేశ్వరం విద్యార్థులు అధ్యంతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహేశ్వరం ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సంగి రమేశ్ ఆదేశాలతో కళాశాల ప్రోగ్రాం అధికారిని డాక్టర్ జహీదా బేగం ఆధ్వర్యంలో 125 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు గాంధీ జయంతి కోసం ప్రత్యేక ఖాదీ చీరలను ధరించి చరకాల ప్రదర్శనలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మంత్రులు 1157 మంది గాంధీల వేషధారణలో వివిధ పాఠశాలల విద్యార్థులు, 1157 చరకాల ప్రదర్శనకు ప్రత్యేక ఖాదీ చీరలతో వివిధ డిగ్రీ కళాశాలలు, ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ప్రదర్శనతో పాటు పెద్ద ఎత్తున విద్యార్థులతో గాంధీ జయంతి ఉత్సవాల అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాల కోసం వివిధ కళాశాల నుంచి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గూడెంలో ఓడేరా కాలనీ లో వైద్య శిబిరం

మలేరియా, డెంగ్యూ నివారణకు ప్రత్యేక చర్యలులి





**పోరు తెలంగాణ పతినిధి రవి:** దండేపల్లి మండలం గూడెం గ్రామంలో ఓడేరా కాలనీ వైద్య శిబిరం నిర్వహించారు. మలేరియా, డెంగ్యూ వ్యాధుల నివారణకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు దోమల బెడద ఉన్న ఇళ్లలో స్ప్రే చేశారు. ఇళ్ల పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి, నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీవాణి, వైద్య సిబ్బంది, సతవ్వ, పంచాయతీ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# మూడు వ్యవసాయ మోటార్లు చోరీ



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కొమిర గ్రామంలో డి 86 కెనాల్ ప్రాంతంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు మూడు వ్యవసాయ విద్యుత్ మోటార్లను చోరీ చేశారు. చిన్న కొమిర గ్రామానికి చెందిన కాసర్ల రాజిరెడ్డి, చదువు శ్రీనివాసరెడ్డి, పెద్ద కొమిర గ్రామానికి చెందిన కేశిరెడ్డి లక్ష్మారెడ్డి ల మోటార్లు చోరీకి గురయినాయి ఉదయం గుర్తించి రైతులు ఆందోళన చెందారు పోలీసులు దుండగులను గుర్తించి, కెనాల్ వెంట గస్తీ పెంచాలని రైతులు కోరారు.

# జైపూర్ లో జాతీయ వన్యప్రాణి వారోత్సవాల వేడుకలు






**పోరు తెలంగాణ, మంచిర్యాల, అక్టోబర్ 3 :** జైపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల లో జాతీయ వన్యాప్రాణి వారోత్సవాల వేడుకలను ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి రాజ్యలక్ష్మి ,స్టూడెంట్స్ కౌన్సిలర్ మెంబెర్ బండి ప్రసాద్, ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ జి సుధాకర్ , ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు రామకృష్ణ సర్కార్ , సి రేపటి , ఎండి ముజిబుద్దీన్ , ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు కే రమేష్, పి వసంతలక్ష్మి, జి శ్రావణ్ కుమార్, కళాశాల అధ్యాపకులు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అడవుల పరిరక్షణ, వన్యప్రానుల ప్రాముఖ్యత పై అవగాహనా కలిపించారు. అడవిని వన్యప్రనులను కాపాడుట ప్రతి పౌరుని ప్రాథమిక విధి తెల్పినారు.

# డబుల్ బెడ్ రూమ్ ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

దరఖాస్తుదారుడు ఓదెల గ్రామ పంచాయతీ పరిధికి చెందిన వారై ఉండాలి

దరఖాస్తు చివరి తేదీ 5 అక్టోబర్ సోమవారం సాయంత్రం 5 గంటల వరకు

**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** ఓదెల గ్రామ పంచాయతీ పరిధిలో తెలంగాణ ప్రభుత్వం ద్వారా నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల మంజూరు కొరకు అర్హులైన నిరుపేద లబ్ధిదారుల నుండి దరఖాస్తులు ఆహ్వానించడమైనది. దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ: 05.10.2026, సోమవారం సాయంత్రం 5:00 గంటల వరకు మండల పరిషత్ కార్యాలయం ఓదెలలో సమర్పించాలని ఎంపీడీవో



అనిల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు

1. దరఖాస్తుదారుడు ఓదెల గ్రామ పంచాయతీ పరిధికి చెందిన వారై ఉండాలి.
2. సొంత ఇల్లు గానీ, ఇంటి స్థలం గానీ లేని నిరుపేద కుటుంబాలకు చెందిన వారై ఉండాలి.
3. తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండాలి.

దరఖాస్తుకు జతపరచవలసిన పత్రాలు:

1. ఆధార్ కార్డు జిరాక్స్
2. రేషన్ కార్డు జిరాక్స్
3. ఓటర్ కార్డు జిరాక్స్
4. ఆదాయ ధృవీకరణ పత్రం
5. పాస్ పోర్ట్ సైజ్ పోటో

దరఖాస్తును లబ్దిదారుడు స్వయంగా వచ్చి మండల పరిషత్ కార్యాలయంలో సమర్పించవలెను. గడువు తర్వాత వచ్చిన దరఖాస్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించబడవని తెలిపారు

# స్కాలర్షిప్ టెస్ట్ మెటీరియల్ పంపిణీ



**మహేశ్వరం అక్టోబర్ 3, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** శనివారం మహేశ్వరం మండల పరిధిలోని మహేశ్వరం మోడల్ స్కూల్ లో 8 వ తరగతి చదువుతున్న విద్యార్థులకు యూత్ ఫర్ సేవా సహకారంతో ఎన్.ఎం.ఎం.ఎస్ నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ టెస్ట్ మెటీరియల్ ను వాలంటీర్ ముయ్యాడ శివ కుమార్ అందజేశారు. యూత్ ఫర్ సేవా వాలంటీర్ ముయ్యాడ శివ కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఎం హెచ్ ఆర్ డి స్కీం కింద దేశవ్యాప్తంగా 1,00,000 స్కాలర్షిప్ లు అందిస్తున్నదని తెలిపారు. ఎవరైతే ప్రభుత్వ బాలుర , బాలికల ఉన్నత పాఠశాల మోడల్ స్కూల్లో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థులు మాత్రమే ఈ ఎన్ ఎం ఎం ఎస్ స్కాలర్షిప్ పరీక్ష రాయడం జరుగుతుందని తెలిపారు. పరీక్షలలో మెరిట్ పొందిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నెలకు ఒక వెయ్యి రూపాయల చొప్పున 4 సంవత్సరాల వరకు స్కాలర్షిప్ లను అందిస్తుందని చెప్పారు. 9వ తరగతి నుండి 12వ తరగతి వరకు ప్రభుత్వ పరిధిలో చదువుకుంటేనే మాత్రమే ఈ స్కాలర్షిప్ వస్తుందని అన్నారు. ప్రతి సంవత్సరము రెన్యువల్ చేయవలసి ఉంటుందని తెలిపారు. ఈ ఎన్.ఎం.ఎం.ఎస్ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవడానికి కుల ధ్రువీకరణ, ఆదాయం ధ్రువీకరణ పత్రము ఏడవ తరగతిలో 55 శాతం మార్కులు వచ్చి ఉండాలని అన్నారు. స్కూల్ డైస్కోడ్ ద్వారా ఈ ఎన్ ఎం ఎం ఎస్ ఈ అప్లికేషన్ చేసుకోవాలనే ఈ పరీక్ష రెండు విభాగాలుగా ఉంటుందని అన్నారు. పార్ట్ వన్ వచ్చేసి ఆప్టిట్యూడ్ 90 మార్కులకు, మ్యాథమెటిక్స్ సైన్స్ సోషల్ సబ్జెక్ట్ 90 మార్కులకు గాను మొత్తం 180 మార్కులకు ఈ పరీక్ష నిర్వహిస్తారని అన్నారు. పరీక్ష మూడు గంటల సమయం ఉంటుందని, ప్రతి ఒక్క క్వస్షన్ కి ఒక నిమిషం మాత్రమే సమయం ఉంటుంది అని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గోపి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యూత్ ఫర్ సేవ వాలంటీర్ ఇంచార్జ్ శ్రీకాంత్ ఎలిమినేటి , డిల్లీ అనిల్, ప్రవీణ్ రెడ్డి కొలికిచర్ల, సుధీర్ పాల్గొనడం జరిగింది.

# అంతర్జాతీయ శాంతి- ప్రతిభ పురస్కారం అందుకున్న షహనాజ్ బేగం

సేవకు దక్కిన అరుదైన గౌరవం.

పలువురు ప్రముఖులు ప్రశంసలు, శుభాకాంక్షలు.

భద్రాద్రి కొత్తగూడెం,

గ్రామ అభివృద్ధి లక్ష్యంగా

గ్రామసభ: సర్పంచ్ బానోత్ పద్మ

**బూర్గంపాడు సెప్టెంబర్ 3 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** పినపాక పట్టి నగర్ గ్రామంలో శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మహాత్మా గాంధీ ఫోటోకు పూలమాలేసి ఘనంగా నివాళులర్పించారు తర్వాత వి.బి.జి.రామ్ జి గ్రామసభను నిర్వహించారు. ఈ




కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ బానోత్ పద్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బానోత్ పద్మ మాట్లాడుతూ... గ్రామాభివృద్ధిలో గ్రామసభలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. గ్రామంలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులు, తాగునీరు, డ్రైనేజీ సమస్యలు, ఉపాధి హామీ పనులు, సంక్షేమ పథకాల అమలుపై సభలో వివరంగా చర్చించారు. గ్రామ ప్రజలందరూ భాగస్వాములై భూమి సర్వే కి గ్రామ అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు. గ్రామపంచాయతీ లో పనిచేస్తున్న పారిశుద్ధకార్మికులను సర్పంచ్ పాలకవర్గ సభ్యులు కలిసి ఘనంగా సన్మానించారుఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, తోట మల్ల వెంకటరమణ పంచాయతీ కార్యదర్శి శ్రీమతి రాజేశ్వరి పాలకవర్గం సభ్యులు,అంగన్వాడీ టీచర్లు కార్యకర్తలు, ఆశా వర్కర్లు మరియు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల జీవితాల్లో నవ వసంతం సొంతింటి కల సాకారమైతేనే ఆత్మగౌరవం!

తుర్రంవారిగూడెంలో లబ్ధిదారుల గృహప్రవేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు





**భద్రాద్రి కొత్తగూడెం,(పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గం ప్రతినిధి-వల్లెపోగు రాము)అశ్వాపురం అక్టోబర్ 3 :-** రాష్ట్రంలోని నిరుపేద కుటుంబాలకు పక్కా గృహ వసతి కల్పించి వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తోందని పినపాక శాసనసభ్యులు, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. శనివారం అశ్వాపురం మండల పరిధిలోని తుర్రంవారిగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నూతనంగా నిర్మించుకున్న ఇళ్ల గృహప్రవేశ మహోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామానికి చెందిన లబ్ధిదారులు బానోతు అచ్చమ్మ, బానోతు శైలజ తమ కుటుంబ సభ్యులతో కలిసి నూతన గృహాల్లోకి ప్రవేశించగా, ఎమ్మెల్యే పాయం స్వయంగా హాజరై వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ?నూతన గృహాల్లోకి అడుగుపెట్టిన లబ్ధిదారుల కుటుంబాలతో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆత్మీయంగా ముచ్చటించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నో ఏళ్ల నిరీక్షణ తర్వాత సొంతింటి కల నెరవేరిన వేళ లబ్ధిదారుల మోముల్లో వెల్లివిరిసిన ఆనందాన్ని ఆయన పంచుకున్నారు. కొత్త ఇంట్లో ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని ఆశీర్వదించారు. గూడు లేని పేదవాడికి సొంతిల్లు అనేది కేవలం నివాసం మాత్రమే కాదని, అది ఆ కుటుంబ భద్రతకు, సమాజంలో వారి ఆత్మగౌరవానికి నిలువెత్తు ప్రతీక అని పేర్కొన్నారు. ?ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం పేదల గృహనిర్మాణానికి పెద్దపీట వేస్తోందన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో, రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక పర్యవేక్షణలో అర్హులైన పేద కుటుంబాలకు గృహ వసతి కల్పించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లతో పాటు తాగునీరు, విద్యుత్, అంతర్గత రహదారులు వంటి కనీస మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. సంక్షేమ పథకాలు దళారుల ప్రమేయం లేకుండా అర్హులందరికీ పారదర్శకంగా అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పనిచేయాలని పిలుపునిచ్చారు.?తుర్రంవారిగూడెంలో నిరుపేద కుటుంబాలు పక్కా ఇళ్లలోకి అడుగుపెట్టడం పట్ల స్థానిక గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ?ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ముత్యాలరావు, డిటి సమ్మయ్య, పంచాయతీరాజ్ డిఇ వెంకటేశ్వర్లు, ఇందిరమ్మ ఏఈలు ఉదయ్,భరత్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ కిషోర్, కార్యదర్శి మూడవత్ యాకుబ్, స్థానిక సర్పంచ్ కుంజ జాను, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు, సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఊసా అనిల్ కుమార్, వేములపల్లి రమేష్,బూరెడ్డి వెంకటరెడ్డి, సర్పంచ్ లు సబ్కా పిచ్చయ్య, యేనిక ఉషారాణి, జిమ్మా ఝాన్సీ, ఉపసర్పంచ్ లు హర్షా నాయక్, మేకల అంజిబాబు,నాయకులు కాకా రాములు, ఆవుల రవి, బిరాజు సంపత్, లంకమల్ల కొండలరావు, యేనిక రవి బాబు, సోదే వెంకటేశ్వర్లు, తూము వీరాఘవులు, బచ్చు వెంకటరమణ, తెల్లం వీరభద్రం, భూక్యా భద్రం, తెల్లం నాగరాజు, తెల్లం వెంకటేశ్వర్లు, గొల్లపల్లి నరేష్, వేముల విజయ్, తాటి రాంబాబు, భట్టి వెంకన్న, రావుల వీరభద్రం, భూక్యా కాళిదాసు, అనబత్తుల సతీష్, నూకల సంపత్, బానోత్ సక్రూ నాయక్, రాందాస్, పిచ్చమ్మ, ఇతర కార్యకర్తలు, గ్రామస్తులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# జలాల్పూర్ గ్రామంలో పోషణ మాస కార్యక్రమం విజయవంతం



**పోరు తెలంగాణ ప్రతినిధి బాల్కొండ (భూమేశ్వర్) :** జలాల్పూర్ గ్రామంలో సర్పంచ్ గుండేటి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం,పిల్లలకు అన్నప్రాసన నిర్వహించడం జరిగింది. పౌష్టికాహార ప్రాముఖ్యతను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ సీ డీ పీ ఓ స్వర్ణలత,ఐసిడిఎస్ సూపర్వైజర్ రేవతి,మండల వైద్య సిబ్బంది,ఐ సి పి ఎస్, ఏపీవో ఇందిర,పంచాయతీ కార్యదర్శి దేవేందర్,ఏఎన్ఎం సరోజ,స్థానిక ఎం పీ పీ ఎస్ స్కూల్ హెచ్ఎం అభిమన్యు,కృపాని,మండలంలోని సమస్త అంగన్వాడీ టీచర్లు,స్థానిక అంగన్వాడీ టీచర్లు పద్మావతి, పుష్పలత,ఆశా వర్కర్ రజిని,ఉప సర్పంచ్ బోజన్న,పాలకవర్గ సభ్యులు శేఖర్, గంగు బాయి,కారోబార్ వేణుగోపాల్ గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# భీమారం 13వ వార్డులో విద్యుత్ స్తంభాల ఏర్పాటు



**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా అక్టోబర్ 3 :** భీమారం గ్రామ పంచాయతీ లోని 13వ వార్డ్ సుంకరిపల్లి లో కొత్తగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. 13వ వార్డులో జాడి జంగలి ఇంటి నుండి సెగ్గం అరవింద్ ఇంటి వరకు విద్యుత్ లైన్ లేదని కాలనీవాసులు జాడి కేశవు, జాడి కుమారస్వామి, కుమ్మరి రాజేష్, కుమ్మరి బబ్లు, జాడి అరవింద్, సెగ్గం రాజేశం తదితరులు సర్పంచ్ పుష్క మల్ల విజయలక్ష్మి పున్నం చంద్ కి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల హామీలు భాగంగా వెంటనే స్పందించిన సర్పంచ్ కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించారు. కాలనీవాసులు సర్పంచ్ కి స్థానిక కాంగ్రెస్ నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి జర్పుల రాజ్ కుమార్, భీమారం మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు దాసరి ప్రకాష్, ఆవుల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ మేళాకు విశేష స్పందన

300 మందికి ఆఫర్ లెటర్లు అందజేసిన ఎమ్మెల్యే హరీష్ బాబు....



**పోరు తెలంగాణ అక్టోబర్ 03: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ పట్టణంలోని పటేల్ గార్డెన్స్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన ఈ మేళాకు బీటెక్, పీజీ, డిగ్రీ, ఇంటర్, పదో తరగతి చదివిన 1,500 మందికి పైగా నిరుద్యోగులు హాజరయ్యారు. మేళాలో ఎంపికైన 300 మందికి సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు ఆఫర్ లెటర్లు అందజేశారు. నిరుద్యోగ యువతను సాధికారత వైపు నడిపించేందుకే ఈ మేళా ఏర్పాటు చేశామని, ప్రతి సంవత్సరం నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. యువత నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవడంపై దృష్టి పెడితే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని సూచించారు. మేళాకు వచ్చిన 45 కంపెనీల హెచ్‌ఆర్ ప్రతినిధులకు, నిరుద్యోగులకు భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు చందర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం, కౌన్సిలర్లు ఈర్ల విశ్వేశ్వర్ రావు, చిప్పకుర్తి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## కొమురం భీం వర్ధంతి ఏర్పాట్లలో లోటు రావొద్దు

జోడేఘాట్‌లో సమీక్షించిన కలెక్టర్ హరిత,పీఓ మకరందు....





**పోరు తెలంగాణ అక్టోబర్ 03: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కెరమెరి మండలం కొమురం భీం 86వ వర్ధంతిని ఈ నెల 26న జోడేఘాట్‌లో ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత, ఐటీడీఏ పీఓ మంద మకరందు అధికారులను ఆదేశించారు. శనివారం జోడేఘాట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.వర్ధంతికి పెద్ద సంఖ్యలో గిరిజనులు, ప్రజాప్రతినిధులు, సందర్శకులు హాజరయ్యే అవకాశం ఉన్నందున, ఎవరికీ అసౌకర్యం కలగకుండా ముందుగానే ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, రవాణా, పార్కింగ్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తగినన్ని తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి వసతులు ఏర్పాటు చేయాలని, వైద్య శిబిరాలు నిర్వహించి అంబులెన్స్‌లు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రహదారుల నిర్వహణ, సూచిక బోర్డులు, సమాచార కేంద్రాలు, సహాయక సిబ్బందిని ఏర్పాటు చేయాలని, వృద్ధులు, మహిళలు, చిన్నారులు, దూర ప్రాంతాల వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. భీం జీవితం, ఆయన పోరాట స్ఫూర్తి, ఆదివాసీ హక్కుల ఉద్యమాన్ని ప్రతిబింబించేలా, గిరిజన సంప్రదాయాలకు అనుగుణంగా కార్యక్రమం ఉండాలన్నారు. ఈ సందర్భంగా కొమురం భీం మనవడు సోనేరావు, గిరిజన సంఘాల నాయకులు తమ సూచనలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. శాఖల వారీగా అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని, పరస్పర సమన్వయంతో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని కలెక్టర్, పీఓ ఆదేశించారు.సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ, ఏపీఓ వసంత్ రావ్, ఆత్రం భాస్కర్, డిప్యూటీ డీఈఓ గోడం చందన్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడిగా మారిన డిప్యూటీ డైరెక్టర్

విద్యార్థులకు స్వయంగా పాఠాలు....

పట్నాపూర్ పాఠశాలలో పాఠాలు బోధించిన జాదవ్ అంబాజీ....



**పోరు తెలంగాణ అక్టోబర్ 03: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేరామేరి మండలం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ కేరామేరి మండలంలోని పట్నాపూర్ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యా ప్రమాణాలు, వసతులు, పాఠశాల నిర్వహణ తీరును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తరగతి గదులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, బోధనా పద్ధతులు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించిన ఆయన, విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి అభ్యసన స్థాయిని తెలుసుకున్నారు. అనంతరం స్వయంగా ఉపాధ్యాయుడిగా మారి తరగతి గదిలో పాఠాలు బోధించారు. విద్యార్థులు ఉత్సాహంగా సమాధానాలు చెప్పడంతో వారిని అభినందించారు. ప్రాథమిక స్థాయిలోనే బలమైన విద్యా పునాది ఏర్పడేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని ఎప్పటికప్పుడు గుర్తించి, వెనుకబడిన వారికి ప్రత్యేక బోధన అందించాలన్నారు. పాఠ్యాంశాలను సులభంగా అర్థమయ్యేలా వినూత్న పద్ధతుల్లో బోధించాలని చెప్పారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ, అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని పేర్కొన్నారు. ఉన్నతాధికారి స్వయంగా పాఠాలు చెప్పడంతో విద్యార్థుల్లో ఉత్సాహం నెలకొందని, ఉపాధ్యాయులు అభినందించారని తెలిపారు.

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ధర్నాకు శ్యామ్ నాయక్ మద్దతు

జీతాలు వెంటనే చెల్లించాలని కాంట్రాక్టర్లకు సూచన....



**పోరు తెలంగాణ అక్టోబర్ 03: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు రెండు నెలలుగా జీతాలు అందడం లేదంటూ ధర్నా చేపట్టారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఈ నిరసన జరిగింది. విషయం తెలుసుకున్న ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ ధర్నా వద్దకు వెళ్లి ఉద్యోగులకు మద్దతు తెలిపారు. వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో సంబంధిత కాంట్రాక్టర్లను పిలిపించి జీతాల ఆలస్యంపై చర్చించారు. కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని, భవిష్యత్తులో ఆలస్యం జరగకుండా చూడాలని సూచించారు. ఉద్యోగుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

### బాలికల ఆశ్రమ పాఠశాలలో

## మరుగుదొడ్లు,కాల్వ నిర్మించాలి

వాంకిడి గిరిజన బాలికల పాఠశాలను సందర్శించిన ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కమిటీ....






**పోరు తెలంగాణ అక్టోబర్ 03: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సరిపడా మరుగుదొడ్లు లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ పేర్కొంది. శనివారం కమిటీ సభ్యులు పాఠశాలను సందర్శించి, విద్యార్థినులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాలలో భోజనం, విద్య తదితర సౌకర్యాలు ఉన్నప్పటికీ, విద్యార్థినులకు సరిపడా మరుగుదొడ్లు లేవని సభ్యులు తెలిపారు. మురుగునీరు బయటకు వెళ్లేందుకు సరైన కాలువ లేదని, ఉన్న కాలువ ద్వారా నీరు సక్రమంగా వెళ్లక అప్పుడప్పుడు నిలిచిపోతోందని విద్యార్థినులు వాపోయినట్లు చెప్పారు. ఈ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అంతకుముందు ఆసిఫాబాద్ మండలం భీంపూర్ చివరిపల్లి గ్రామాన్ని కమిటీ సభ్యులు సందర్శించారు. గత నెల 28న కలెక్టర్ కార్యాలయ ఆవరణలో న్యాయం చేయాలంటూ పెట్రోల్ పోసుకున్న మిట్ట మల్లన్న ఘటనపై గ్రామంలో విచారణ జరిపారు. దీనికి సంబంధించిన నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రేగుంట కేశవ్ రావు, డాక్టర్ అశోక్ మహుల్కర్, బనోత్ గోపాల్ నాయక్, ఇగారపు గణేష్, కొబ్రగడే గంగుబాయి తదితరులు పాల్గొన్నారు.

## గురిబాయి మృతదేహానికి శ్యామ్ నాయక్ నివాళి

దేవాపూర్‌లో అంబాజీ కుటుంబానికి పరామర్శ....



**పోరు తెలంగాణ అక్టోబర్ 03 కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేరమెరి మండలం దేవాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు అంబాజీ మాతృమూర్తి గురిబాయి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ దేవాపూర్‌లోని వారి నివాసానికి వెళ్లి, గురిబాయి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంబాజీ కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి మనోధైర్యం కల్పిస్తూ, గురిబాయి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కేరమెరి మండల అధ్యక్షుడు సుజాత ఖాన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎల్లప్ప, రజక, సుదర్శన్, రావి నాయక్, గ్రామస్తులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అసలు మనకు నిద్ర ఎందుకు అవసరం..? రోజూ తగినన్ని గంటలపాటు నిద్రించకపోతే ఏమవుతుంది..?



నిద్ర అనేది మనషి శరీరానికి అత్యవసరం. సరైన మోతాదులో నీళ్లను తాగడం, వ్యాయామం చేయడం, పౌష్టికాహారం తీసుకోవడం ఎంత అవసరమో రోజూ తగినన్ని గంటల పాటు నిద్రించడం కూడా అంతే అవసరం. నిద్రించడం వల్ల మెదడు పునరుత్తేజం చెందుతుంది. మెదడు కణాలు మరమ్మత్తులకు గురవుతాయి. రోజంతా మనం చేసే పనులను జ్ఞాపకాల రూపంలో మెదడు భద్రపరుచుకునేందుకు నిద్ర ఉపయోగపడుతుంది. మన జ్ఞానం, తెలివితేటలు, నైపుణ్యాలను మెరుగు పరిచేందుకు మెదడుకు నిద్ర అవసరం అవుతుంది. నిద్ర వల్ల శరీరం కూడా తన భాగాలకు తాను మరమ్మత్తులు చేసుకుంటుంది. ముఖ్యంగా కణజాలాలు మరమ్మత్తులకు గురవుతాయి. కండరాలు, కణాలు నిర్మాణమవుతాయి. నిద్ర వల్ల శరీరం వ్యర్థాలను సులభంగా బయటకు పంపిస్తుంది. హార్మోన్లు సక్రమంగా పనిచేస్తాయి. రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. ఇలా నిద్ర వల్ల మనకు ఎంతో మేలు జరుగుతుంది.

**అనేక సమస్యలు..**

అయితే రోజూ తగినన్ని గంటలపాటు కచ్చితంగా నిద్రించాల్సి ఉంటుంది. నిద్ర అనేది వ్యక్తిని, వయస్సును, వాతావరణ పరిస్థితులను బట్టి ఒక వ్యక్తి రోజుకు ఎన్ని గంటలపాటు నిద్రించాలి అనే సమయం మారుతుంది. సాధారణంగా రోజుకు 6 నుంచి 8 గంటల పాటు అయినా సరే నిద్రించాలని వైద్యులు చెబుతుంటారు. అయితే సరిగ్గా నిద్రించకపోతే అనేక దుష్పరిణామాలు ఎదురవుతాయి. మెదడు పనితీరు మందగిస్తుంది. చురుగ్గా ఉండలేకపోతారు. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత తగ్గుతాయి. మతిమరుపు పెరుగుతుంది. ఏ విషయంపై ధ్యాస పెట్టలేకపోతుంటారు. ఆసక్తిగా అనిపించదు. ఎల్లప్పుడూ ఆందోళన, కంగారు, విసుగు ఉంటాయి. నిర్ణయాలను తీసుకోవడంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తుంటారు. బద్దకంగా ఉంటారు. రోగ నిరోధక శక్తి తగ్గుతుంది. ఆకలి పెరుగుతుంది. అతిగా ఆహారం తింటారు. దీంతో బరువు పెరుగుతారు.

**దీర్ఘకాలంలో అయితే..**

దీర్ఘకాలంలో నిద్రలేమి సమస్య ఉంటే అది తీవ్ర అనారోగ్య సమస్యలకు దారి తీస్తుంది. నిద్రలేమి వల్ల గుండె జబ్బులు వచ్చే ప్రమాదం పొంచి ఉంటుంది. జీవక్రియలు మందగిస్తాయి. టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. మానసిక ఆరోగ్యం సన్నగిల్లుతుంది. శరీరం వ్యర్థాలను బయటకు పంపలేకపోతుంది. దీంతో శరీరం విషతుల్యంగా మారి రోగాలు వస్తాయి. కనుక ఇలా జరగకుండా ఉండాలంటే రోజూ తగినన్ని గంటలపాటు నిద్రించాల్సి ఉంటుంది. అయితే నిద్రలేమి సమస్య ఉన్నవారు రోజూ వ్యాయామం చేయడం, ఒత్తిడి, ఆందోళనను తగ్గించుకోవడం వంటి పనులు చేస్తే ఫలితం ఉంటుంది. అలాగే కొన్ని రకాల ఆహారాలను రాత్రి పూట తీసుకోవడం వల్ల కూడా ఉపయోగం ఉంటుంది. ఆ ఆహారాలను తీసుకుంటే నిద్రను ప్రోత్సహిస్తాయి. దీంతోపాటు పలు పోషకాలను కూడా అందిస్తాయి.

**ఈ ఆహారాలను తీసుకోవాలి..**

రాత్రి పూట నిద్ర సరిగ్గా పట్టాలంటే ట్రిప్టోఫాన్, మెలటోనిన్, మెగ్నిషియం, పొటాషియం వంటి పోషకాలు ఉండే ఆహారాలను తీసుకోవాల్సి ఉంటుంది. ఇవన్నీ ఒత్తిడి, ఆందోళనను తగ్గించి మైండ్ రిలాక్స్ అయ్యేలా చేస్తాయి. దీంతో నిద్ర చక్కగా పడుతుంది. ట్రిప్టోఫాన్ లభించాలంటే రాత్రి పూట పాలను తాగాలి. చికెన్, కోడిగుడ్లు, చీజ్, పల్లీలు, గుమ్మడికాయ విత్తనాలు, టోఫు వంటి ఆహారాలను తీసుకుంటే మెలటోనిన్ లభిస్తుంది. వాల్ నట్స్, పిస్తా కూడా మేలు చేస్తాయి. చెర్రీ పండ్లను తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. అలాగే బాదంపప్పు, పాలకూర, అవకాడో, అరటి పండ్లను తింటుంటే మెగ్నిషియం లభిస్తుంది. ఇది కూడా నిద్రను ప్రోత్సహిస్తుంది. చిలగడదుంపలు, ఓట్ మీల్, బ్రౌన్ రైస్, కమోమిల్ టీ వంటి వాటిని తీసుకుంటున్నా ఎంతగానో ఉపయోగం ఉంటుంది. అయితే వీటిని రాత్రి నిద్రకు ఒక గంట ముందు తీసుకుంటే ఫలితం ఉంటుంది. ఇలా నిద్రలేమిని తగ్గించుకోవచ్చు. రోజూ తగినన్ని గంటలపాటు కచ్చితంగా నిద్రించవచ్చు.

### చెన్నూరులో బిజెపి ఆధ్వర్యంలో

## సేవలో నా భాగస్వామ్యం కార్యక్రమం





**పోరు తెలంగాణ, మంచిర్యాల, అక్టోబర్ 3 :** నరేంద్ర మోడీ 25 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా ప్రధానమంత్రిగా సేవలందించిన సందర్భంగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా చెన్నూరు పట్టణంలో సేవలో నా భాగస్వామ్యం కార్యక్రమాన్ని బిజెపి జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా అభినవ పోతన బిరుదులు వానమామలై వరదాచార్యులు విగ్రహం వద్ద పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేసి ఆయన విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలతో అలంకరించి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపుమేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రతి కార్యకర్త ఏదో ఒక సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఈ సేవా సంకల్ప విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఏతం శివకృష్ణ గర్రెపల్లి శాంతా వెంకట నరసయ్య పట్టణ ప్రధాన కార్యదర్శి కాగిత వెంకటేష్ పట్టణ నాయకులు ఆడప శ్రీనివాస్ ప్రసాద్ తగరం మధురాజ్ చటారి వెంకటేష్ శ్యాం వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ ఎస్సీకి వినతి పత్రం అందజేసిన దోమకొండ సర్పంచ్ ఐరేని నర్సయ్య





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి :అక్టోబర్ 3(పోరు తెలంగాణ న్యూస్:) :** కామారెడ్డి జిల్లా దోమకొండలో విద్యుత్తు కోతలు లేకుండా చూడాలని కోరుతూ శనివారం విద్యుత్ శాఖ సూపరిండెండింగ్ ఇంజనీర్ సాలియా నాయక్ కు దోమకొండ సర్పంచ్ ఐరేణి నరసయ్య పాలకవర్గ సభ్యులతో కలిసి వినతి పత్రం అందజేశారు. దోమకొండ గ్రామం తో పాటు మండలంలో పంటలు చివరిదశకు వచ్చిన సందర్భంగా విద్యుత్ కోతలు లేకుండా చూడాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. దోమకొండలో స్ట్రీట్ లైట్స్కు కు సపరేటు ట్రాన్స్ఫార్మర్ బిగించే విధంగా చూడాలని, ఆయా కాలనీలలో పాత పోల్స్ ను తీయించి కొత్త పోల్స్ బిగించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాస్,ఉప సర్పంచ్ బొమ్మేర శ్రీనివాస్, వార్డు సభ్యులు శ్రీనివాస్, శేఖర్, సంతోష్, మల్లేశం, శంకర్, కొండల్ రెడ్డి,స్వామి, రాజేందర్,లింగం తదితరులు పాల్గొన్నారు.

## రైతు వేదికలో ఏడీఏ, ఏవో ఏ.ఈ.ఓ లకు సన్మానం



**పోరు తెలంగాణ పతినిధి రవి దండేపల్లిలి :**దండేపల్లి మండలం గూడెం గ్రామ రైతు వేదికలో వ్యవసాయ శాఖ అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ కృష్ణ సార్, ఏవో, శ్రీకాంత్ సార్ ఏఈవో శ్రావణ్ లను కన్నేపల్లి సర్పంచ్ చుంచు నాగేశ్, ఉప సర్పంచ్ ముత్తే శంకరయ్య.గూడెం మాజీ ఎంపీటీసీ తోట మోహన్ శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు. రైతుల సమస్యలు, వ్యవసాయానికి సంబంధించిన అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు.

### ఇంద్లాతండా గ్రామంలో

## కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్



**ఇల్లందు అక్టోబర్ 3 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాస్ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు ఆధ్వర్యంలో శనివారం తెల్లవారుజామున ఇల్లందు సబ్‌డివిజన్ పోలీసు సిబ్బంది, టీజీఎస్‌పీ సిబ్బందితో కలిసి కొమరారం గ్రామపంచాయతీ పరిధిలోని ఇంద్లాతండా గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. 30 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోల ధ్రువపత్రాలు పరిశీలించి సరియైన ధ్రువపత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుర్వినియోగం, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతా చర్యలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలో అపరిచితులు లేదా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు గుర్తించిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అలాగే గంజాయి వంటి అక్రమ మాదకద్రవ్యాల విక్రయాలు, నిల్వలు, గుడుంబా తయారీ లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు, విలువైన మరియు విశ్వసనీయ సమాచారాన్ని అందించిన వారికి తగిన ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, టీజీఎస్‌పీ సిబ్బంది కలిపి మొత్తం 60 మంది పోలీసులు పాల్గొన్నారు.

# జేబులో పట్టే మల్టీప్లగ్



ఇంట్లో ఎన్నెన్నో గాడ్జెట్స్ వాడుతుంటాం. దాంతో ఎప్పుడూ పవర్ సాకెట్స్ కొరత ఉంటుంది. ఒక్కో పరికరానికి ఒక్కోరకం ప్లగ్ అవసరం పడుతుంది. అలాంటి సమయంలో.. జీఎం కంపెనీ అందిస్తున్న ఈ 3 పిన్ 6 ఏఎంపీ యూనివర్సల్ మల్టీప్లగ్ ట్రావెల్ అడాప్టర్ మంచి ఆప్షన్. ఇది కేవలం ఇంటికే కాదు, ప్రయాణాలకు కూడా పర్‌ఫెక్ట్‌గా సూటవుతుంది. స్టూడెంట్స్‌కి, ఎప్పుడూ ప్రయాణాలు చేసేవారికి, ఇంట్లో ల్యాప్‌టాప్‌లు, మొబైల్స్, నైట్ ల్యాంపులు లాంటివన్నీ ఒకే దగ్గర కనెక్ట్ చేయాలనుకునే వారికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. యూనివర్సల్ కనెక్టివిటీ దీంట్లో ప్రత్యేకత. ఇందులో రెండు ఇంటర్నేషనల్ సాకెట్స్ ఉంటాయి. అంటే.. విదేశాల నుంచి తెచ్చుకున్న ఫోన్ చార్జర్లు, కెమెరా చార్జర్లు లాంటివి కూడా దీనికి ఈజీగా కనెక్ట్ చేయొచ్చు. ఈ అడాప్టర్‌లో ఇన్–బిల్ట్ సర్జ్ ప్రొటెక్టర్ ఉంది. వోల్టేజ్‌లో హెచ్చుతగ్గులు ఉన్నా.. మీ ఖరీదైన ల్యాప్‌టాప్‌లు, మొబైల్స్‌కి ఎలాంటి డ్యామేజ్ కాదు. ఇది చాలా కాంపాక్ట్, లైట్‌వెయిట్ కూడా. దీన్ని ఎక్కడికైనా తీసుకెళ్లొచ్చు. ఎక్కడైనా వాడొచ్చు.

ధర: రూ. 250

దొరుకు చోటు: అమెజాన్, ఫ్లిప్‌కార్ట్

చిన్న ల్యాంప్.. ఎన్నో పనులు!

ఇంట్లో ఒక ఎమర్జెన్సీ లైట్ కచ్చితంగా ఉండాలి. ఎందుకంటే.. రాత్రిపూట కరెంటు పోయినా, ఏదైనా రిపేర్ చేయాల్సి వచ్చినా.. అది లేకుంటే కష్టంగా ఉంటుంది. అయితే, మార్కెట్‌లో ఎమర్జెన్సీ లైట్ అనగానే ఎన్నెన్నో మోడల్స్ కనిపిస్తాయి. కానీ, వాటన్నిటిలో ఈ లైట్ వేరు. ఇదో రీచార్జబుల్ క్యాంపింగ్ ల్యాంప్. చూసేందుకు చిన్నదే అయినా, చేసే పనులు మాత్రం ఎన్నో! తక్కువ బడ్జెట్‌లోనే మన అవసరాలన్నిటినీ తీర్చేస్తుంది. ఈ వాటర్‌ప్రూఫ్ ఎల్ఈడీ టెంట్ లైట్ పాతకాలం నాటి వింటేజ్ డిజైన్‌లో ఉంటుంది. అవసరం కోసమే కాదు.. ఇంటి అలంకరణకూ వాడొచ్చు. టెంట్ లోపల్నో, ఇంటి హాల్‌లోనో దీన్ని హుక్‌కి తగిలిస్తే అద్భుతంగా కనిపిస్తుంది. దీంట్లో మూడు రకాల లైట్ మోడ్స్ ఉన్నాయి. తక్కువ కాంతితో వాడితే.. 8 గంటల వరకు, ఎక్కువ కాంతితో వాడితే.. 2 గంటల వరకూ పనిచేస్తుంది. దీని వార్మ్ లైట్ కాంతి కంటికి ఇబ్బంది కలిగించదు. దీనికి ఉన్న హుక్ డిజైన్ కారణంగా.. టెంట్‌కి, బ్యాగుకి, ఎక్కడైనా సులభంగా తగిలించుకోవచ్చు. ఇందులో ఇన్–బిల్ట్ రీచార్జబుల్ బ్యాటరీ ఉంది. పదేపదే బ్యాటరీలు మార్చాల్సిన అవసరం ఉండదు. కేవలం 2 గంటల్లోనే పూర్తిగా చార్జ్ అవుతుంది. వాటర్–రెసిస్టెంట్ ఫీచర్ వల్ల, వర్షంలో, మంచులో ఉన్నా లైట్ పాడవ్వదు. కింద పడిపోయినా పగిలిపోకుండా, డ్యూరబుల్‌గా ఉంటుంది.



ధర: రూ. 600

దొరుకు చోటు: అమెజాన్, ఫ్లిప్‌కార్ట్

కళ్లకు కూల్ ట్రీట్‌మెంట్!

ఉదయం లేచిన దగ్గర్నుంచి రాత్రి పడుకునే వరకు ఏదో ఒక స్క్రీన్ చూస్తూనే ఉంటున్నాం. కంప్యూటర్‌లో ఆఫీస్ పని, ఇంట్లో టీవీ, బయట మొబైల్.. దీంతో మన కళ్లు చాలా త్వరగా అలసిపోతున్నాయి. కళ్ల కింద నల్లటి వలయాలు, కళ్లు ఎర్రబడటం, నొప్పి రావడం లాంటి సమస్యలు సర్వసాధారణమై పోయాయి. అలాంటి సమస్యలకు డాక్టర్ దగ్గరికి వెళ్లకుండానే, తక్కువ బడ్జెట్‌లో మనకు మనమే ఇంట్లో 'కూల్ ట్రీట్‌మెంట్' ఇచ్చుకోవచ్చు. అదే బోల్డ్ హెల్త్ కూలింగ్ ఐ జెల్ మాస్క్. ఇది ఆల్–ఇన్–వన్ సొల్యూషన్! ఈ జెల్ మాస్క్‌ను కొద్దిసేపు ఫ్రిజ్‌లో పెట్టి, ఆ తర్వాత కళ్లపై పెట్టుకుంటే చాలు. కళ్ల చుట్టూ ఉన్న చర్మం బిగుతుగా, ప్రకాశవంతంగా మారుతుంది. మైగ్రేన్ తలనొప్పి, సైనస్ నొప్పితోపాటు ఒత్తిడి నుంచీ ఉపశమనం కలిగిస్తుంది. నిద్ర సరిగా లేక కళ్లు ఉబ్బినట్లు ఉన్నా, రోజంతా కంప్యూటర్ ముందు కూర్చుని కళ్లు పొడిబారినా.. ఈ మాస్క్ గొప్ప పరిష్కారం చూపుతుంది. కొద్దిసేపు పెట్టుకుంటే చాలు.. కళ్లు చాలా రిలాక్స్ అవుతాయి.

# బీసీలకు వలపన్ని తామే చిక్కిరి!



కాంగ్రెస్ పార్టీ తీరును చూసి ఒక్కోసారి నమ్మశక్యం కాని ఆశ్చర్యం కలుగుతుంది. ఉదాహరణకు, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను ప్రస్తుత 23 శాతం నుంచి 42 శాతానికి పెంచగలమనే హామీని ఇవ్వాలనే ఆలోచన ఆ పార్టీలోని ఏ మేధావికి కలిగినట్టు? అవి పార్టీ మేనిఫెస్టోలోని ఆర్థిక, పరిపాలనాపరమైన హామీల వంటిది కాదు. చట్టాన్ని మార్చితే తప్ప అమలు కాదు. అట్లా చట్టాన్ని కేంద్రం తప్ప రాష్ట్రం మార్చలేదు. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదనే సుప్రీంకోర్టు తీర్పు దృష్ట్యా కేంద్రం సైతం మార్చటం సాధ్యం కాదు. లోగడ కొన్ని రాష్ట్రాలు ప్రయత్నించగా కోర్టులలో నిలవలేదు. ఈ విషయాలన్నీ ఇప్పుడు కొత్తగా కనుగొని రాస్తున్నవి కాదు. కాంగ్రెస్‌తో సహా అన్ని పార్టీలకు తెలుసు. ప్రభుత్వాధికారులకు తెలుసు. న్యాయవాదులకు తెలుసు. బీసీ నాయకులకు కూడా తెలుసు. అయినప్పటికీ ఆ మాటను కామారెడ్డి డిక్లరేషన్‌లో ఎందుకు చేర్చినట్టు? విషయాలు తెలిసినవారు వలదని వారించినా ఆ పని ఎందుకు చేసినట్టు? అటువంటి సూచన చేసిన మేధావి, లేదా మేధావులు ఎవరై ఉంటారు? వారికి పరిస్థితి తెలియదని భావించలేం. విడిగా కామారెడ్డి డిక్లరేషన్ రచయితలు ఎవరో తెలియదు గాని, మేనిఫెస్టో కమిటీ పేర్లు మాత్రం అందులోని మూడవ కవర్ పేజీలో ఉన్నాయి. కమిటీ అధ్యక్షుడు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు. ఆయన ఉన్నత విద్యావంతుడే గాక ఢిల్లీ యూనివర్సిటీ నుంచి, బీఏ ఎల్ఎల్‌బీ చేశారు. కొంతకాలం హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. అందువల్ల, రిజర్వేషన్ల హెచ్చింపుతో సంబంధం గల చట్టపరమైన కోణాలు ఆయనకు తప్పక తెలిసి ఉండాలి. తను గాక కమిటీకి ఒక ఉపాధ్యక్షుడు, 20 మంది సభ్యులు ఉన్నారు. అందరూ ప్రముఖులే. వారిలో కొందరు బడుగువర్గాల వారు. కామారెడ్డి డిక్లరేషన్ తయారుచేసినవారి పేర్లు కూడా తెలిస్తే బాగుండేది. తెలియదు గనుక వదిలివేద్దాం. మొత్తం మీద ఈ విధంగా బీసీలకు బుద్ధిపూర్వకంగా వలపన్నటమనే పని దశలు దశలుగా జరుగుతూ వచ్చిందన్నది స్పష్టం. మొదటిది, ఈ ఆలోచన ఒరిజినల్‌గా హైదరాబాద్‌లోనో, ఢిల్లీలోనో ఎవరికి వచ్చిందన్నది. రెండు, సదరు ఆలోచనను హైదరాబాద్‌లో, ఢిల్లీలో ఒరిజినల్‌గా ఆమోదించిన బాధ్యులు ఎవరన్నది. మూడు, ఆ మాటను కామారెడ్డి డిక్లరేషన్‌లో చేర్చటానికి ముందు చర్చించి, ఆమోదించినవారు ఎవరన్నది. నాలుగు, వివిధ డిక్లరేషన్లు అన్నీ కలిపి అంతిమంగా 'అభయహస్తం మేనిఫెస్టో'ను ప్రకటించినప్పుడు మేనిఫెస్టో కమిటీ బీసీ రిజర్వేషన్ల హెచ్చింపు సాధ్యాసాధ్యాల గురించి చర్చించిందా? చర్చిస్తే ముఖ్యంగా చట్టపరమైన సాధ్యాసాధ్యాలు చర్చకు వచ్చాయా? చర్చించి ఉంటే ఏమి భావించారన్నది. ఇప్పుడు రాష్ట్ర హైకోర్టులో ఎదురైన పరిస్థితి దృష్ట్యా ఎవరైనా జర్నలిస్టులు కామారెడ్డి డిక్లరేషన్ తయారీదారులను, మేనిఫెస్టో కమిటీ పెద్దలను, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధినాయకులను, కేంద్ర అధినాయకులను ఆయా విషయాలపై ఇంటర్వ్యూలు చేయగలిగితే బీసీలకు, ప్రజలకు చాలా తెలుస్తాయి. దీనిగురించి ఇంత చర్చించి ఇన్ని ప్రశ్నలు లేవనెత్తటం ఎందుకంటే, ఓట్ల కోసం ఇటువంటి అసాధ్యపు హామీని తెలిసి కూడా ఇవ్వటం ఒక పథకం వంటిది. ఒక ఆపరేషన్ వంటిది. నేర్పుగా, ఓర్పుగా ఒక వల పన్నటం వంటిది. కనుక, సదరు ఆపరేషన్ మొదటినుంచి చివరి వరకు ఏ విధంగా సాగిందనే విషయం ప్రజలకు వెల్లడి కావాలి. ఇది ఒకఆశను హత్య చేయటంపై అపరాధ పరిశోధన వంటిది. మేనిఫెస్టోలో సాధారణంగా మూడు విధాలైన హామీలుంటాయి. ఆర్థికపరమైనవి, పరిపాలనా సంబంధమైనవి, చట్టాలతో నిమిత్తం గలవి. హామీలు అన్నీ అమలవుతాయని ప్రజలేమీ భావించరు. తమ అనుభవంలో అనేక పార్టీల అనేక హామీలను చూశారు గనుక. హెచ్చుతగ్గులు ఎ ప్పుడూ ఉంటాయి. కానీ కొన్ని హామీలు ముఖ్యంగా మారి ప్రజల మనసుకు ఎక్కుతాయి. అదిగాక, మేనిఫెస్టోలను, హామీలను వారు ఒకప్పటి వలె గాక, తమకు చైతన్యాలు పెరిగిన కొద్దీ, జీవితావసరాలు పెరిగిన కొద్దీ ఎక్కువగా పట్టించుకుంటున్నారు. అది వారి ఓటింగ్ సరళిపై ప్రభావం చూపుతున్నది.

ఇదంతా విషయానికి సాధారణ కోణం కాగా, ఆర్థికపరమైన, పరిపాలనాపరమైన హామీల అమలులో వైఫల్యం కన్న, రిజర్వేషన్లు పెంచటంలోని వైఫల్యం అనేక రెట్లు ప్రభావం చూపుతుంది. ఎందుకంటే, మొదటి రెండు అమలుకావటం లేదా కాకపోవటం వల్ల ఓటర్లకు వ్యక్తిగతంగానో, చిన్న సమూహాలకో, ఒక కాలపరిమితితో లాభాలు, నష్టాలు జరుగుతాయి. బీసీ రిజర్వేషన్ల అంశం అందుకు చాలా భిన్నమైనది. అది, రాష్ట్ర ప్రభుత్వ సర్వే చెప్తున్న లెక్కల ప్రకారమే సగానికి పైగా జనాభాకు సంబంధించినది. అనేకానేక వెనుకబడిన కులాలతో నిమిత్తం గలది. ఒకసారి ఈ పని జరిగితే చిన్నపాటి బీసీ కులాలలో కొత్త స్పృహలు కలిగి, కొత్త డిమాండ్లు వచ్చి, వారికి కూడా అవకాశాలు లభించగలవని ఆ వర్గాలన్నీ ఆశగా ఎదురుచూస్తున్నవి. ఒకసారి రాజకీయ రిజర్వేషన్ల హెచ్చింపుతో మొదలైతే ఇతర రంగాలకు విస్తరించగలదని ఆశిస్తున్నది. అంతవరకెందుకు కాంగ్రెస్ మేనిఫెస్టోలో చేర్చిన కామారెడ్డి డిక్లరేషన్‌నే చూద్దాం. అది మూడు పేజీలలో విస్తరించి ఉంది. అందులో 11 భాగాలున్నాయి. రిజర్వేషన్లనే గాక నిధులు, సంక్షేమం, విద్య, చేతివృత్తులను పేర్కొన్నారు. అదిగాక 'వివిధ సామాజికవర్గాలకు హామీలు' పేరుతో 8 ముఖ్యమైన కులాలను , 5 ఉప కులాలను ప్రస్తావించారు. వారందరికి కలిపి 17 హామీలున్నాయి. అనగా ఈ అంశం చాలా విస్తృతమైనది. భవిష్యత్తుకంతా వర్తించి బీసీలకు అనేక విధాలుగా మేలు చేయగలది.

# పోలీస్ రిక్రూట్ మెంట్ అభ్యర్థులకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత వసతి శిక్షణ స్టడీ మెటీరియల్ పంపిణీ

## అభ్యర్థులకు ప్రతి అడుగులో జిల్లా పోలీస్ శాఖ అండగా ఉంటుంది....

## జిల్లా ఎస్పీ నితికా పంత్....





**పోరు తెలంగాణ అక్టోబర్ 03: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్, మార్గదర్శకత్వంలో,పోలీస్ రిక్రూట్మెంట్ కి సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత వసతి, భోజనం మరియు శిక్షణ అందించే కార్యక్రమాన్ని 31.08.2026న ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రవేశ పరీక్షకు సుమారు 2,700 మంది అభ్యర్థులు హాజరుకాగా,వారిలో ప్రతిభ ఆధారంగా 150 మంది అభ్యర్థులను ఎంపిక చేసి ఉచిత వసతి శిక్షణ అందిస్తున్నారు. శిక్షణ ప్రారంభ దశలో అభ్యర్థులకు అంకగణితం ,తార్కిక సామర్థ్యం అంశాలకు సంబందించిన ఉచిత అధ్యయన సామగ్రిని అందజేశారు.అభ్యర్థుల విద్యా ప్రగతిని నిరంతరం అంచనా వేసి,అవసరమైన మార్గదర్శకత్వం అందించేందుకు ఇప్పటివరకు మూడు పరీక్షలను నిర్వహించారు. అదేవిధంగా,జిల్లా ఎస్పీ నితిక పంత్, ఐపీఎస్ గాలాల్ శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు ఉచిత అధ్యయన సామగ్రిని స్వయంగా పంపిణీ చేశారు. అభ్యర్థులు రాత పరీక్షకు సమర్థవంతంగా సిద్ధమయ్యేలా అవసరమైన అధ్యయన సామగ్రిని అందుబాటులో ఉండటశీతో పాటు,వారి విద్యా ప్రగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. శిక్షణ కార్యక్రమానికి అభ్యర్థులు ఎంతో ఆసక్తితో హాజరవుతూ,క్రమశిక్షణతో శిక్షణ పొందుతున్నారు.రాత పరీక్షకు అవసరమైన అకడమిక్ శిక్షణతో పాటు,పోలీస్ రిక్రూట్మెంట్ నిర్వహించే శారీరక దారుఢ్య పరీక్షలకు అభ్యర్థులు సమర్థవంతంగా సిద్ధమయ్యే విదంగా ప్రత్యేక శారీరక శిక్షణ తరగతులను కూడా నిర్వహిస్తున్నారు. అభ్యర్థులకు కల్పిస్తున్న వసతి,భోజన సదుపాయాల నాణ్యతను జిల్లా ఎస్పీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ,అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.వసతి,భోజనం మరియు శిక్షణకు సంబంధించిన ఏర్పాట్లపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. అదేవిధంగా,ప్రతి వారం అభ్యర్థుల నుండి అభిప్రాయాలను సేకరిస్తూ, శిక్షణలో ఏదైనా అంశం అర్థం కాకపోయినట్లయితే సంబంధిత అంశంపై పునఃశిక్షణ లేదా అదనపు తరగతులను నిర్వహించి, అభ్యర్థులకు అవసరమైన అవగాహన కల్పిస్తున్నారు.ఈ ఉచిత వసతి శిక్షణ కార్యక్రమం ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన అభ్యర్థులకు ఎంతో ఉపయోగకరంగా మారింది. హైదరాబాద్ వంటి నగరాల్లో అందుబాటులో ఉండే నాణ్యమైన పోలీస్ రిక్రూట్మెంట్ శిక్షణను తమ జిల్లాలోనే ఉచితంగా పొందుతున్నందుకు పలువురు అభ్యర్థులు వారి మాటల్లో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ రిక్రూట్మెంట్ కు హాజరయ్యే అభ్యర్థులకు అవసరమైన విద్యా మరియు శారీరక శిక్షణతో పాటు సమర్థవంతమైన మార్గదర్శకత్వాన్ని అందిస్తూ,రిక్రూట్మెంట్ ప్రక్రియకు వారిని సన్నద్ధం చేయడం జిల్లా పోలీస్ శాఖ లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది అని తెలిపారు .ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్ కుమార్,స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ సతీష్,పోలీస్ సిబ్బంది మరియు అభ్యర్థులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి తలకు తీవ్రమైన గాయాలు

## అత్యవసర మెదడు శస్త్రచికిత్సతో రోగి ప్రాణాలు నిలబెట్టిన

## బిబిబిమలక్ పేట్ యశోదా వైద్యులు

## బిబిబిరోడ్డు ప్రమాద బాధితుల్ని కాపాడడంలో సత్వర స్పందన, అధునాతన వైద్యం అత్యంత కీలకం

**పోరు తెలంగాణ,ఖమ్మం, అక్టోబర్ 3:** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మెదడులో రక్తస్రావం, వాపుతో పాటు మాస్ ఎఫెక్ట్, మిడ్‌లైన్ షిఫ్ట్ ఏర్పడిన 29 ఏళ్ల యువకుడికి తొలుత డీకంప్రెసివ్ క్రానియెక్టమీ నిర్వహించి, ఆ సమయంలో తొలగించిన పుర్రె ఎముక భాగాన్ని పొత్తికడుపు ముందు భాగంలో భద్రపరిచి, రోగి కోలుకున్న అనంతరం దానిని తిరిగి అమర్చి మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో విజయవంతంగా క్రానియోప్లాస్టీ నిర్వహించారు. ఖమ్మం జిల్లా అశ్వాపురానికి చెందిన చింతల సురేష్ రోడ్డు ప్రమాదంలో తీవ్రమైన ట్రామాటిక్ బ్రెయిన్ ఇంజ్యూరీకి గురయ్యారు. ఆయనకు లెఫ్ట్ ఫ్రంటల్ సబ్‌డ్యూరల్ హెమరేజ్‌తో కూడిన హెమరేజిక్ కంట్యూషన్, మాస్ ఎఫెక్ట్, మిడ్‌లైన్ షిఫ్ట్ ఏర్పడ్డాయి. వీటితో పాటు బైలేటరల్ ఫ్రంటల్, టెంపోరల్ సల్కల్ స్పేసెస్‌లో సబ్‌అరాక్నాయిడ్ హెమరేజ్, రైట్ ఫ్రంటోటెంపోరల్ సబ్‌డ్యూరల్ హెమరేజ్, ఫాల్సైన్ సబ్‌డ్యూరల్ హెమరేజ్, డిఫ్యూజ్ సెరిబ్రల్ ఎడిమా కూడా ఉన్నట్లు గుర్తించారు. కుడివైపు పెరైటల్, స్క్వామస్, మాస్టాయిడ్ టెంపోరల్ బోన్స్‌లో ఫ్రాక్చర్స్‌తో పాటు రైట్ ఎక్స్‌టర్నల్ ఆడిటరీ కెనాల్ యాంటీరియర్ వాల్ ఫ్రాక్చర్ కూడా ఏర్పడింది. తీవ్రమైన మెదడు గాయాల నేపథ్యంలో సురేష్‌కు లెఫ్ట్ ఫ్రంటో–టెంపోరో–పెరైటల్ డీకంప్రెసివ్ క్రానియెక్టమీ, డ్యూరోటమీ, సబ్‌డ్యూరల్ హెమరేజ్, లెఫ్ట్ ఫ్రంటల్ కంట్యూషన్ ఎవాక్యుయేషన్, సిస్టర్నోటమీ, సిస్టర్నల్ డ్రెయిన్ ప్లేస్‌మెంట్, జీ–ప్యాచ్‌తో డ్యూరాప్లాస్టీ నిర్వహించారు. ఈ శస్త్రచికిత్స సమయంలో తొలగించిన బోన్ ఫ్లాప్‌ను యాంటీరియర్ అబ్డామినల్ వాల్‌లో, అంటే పొత్తికడుపు ముందు భాగంలోని గోడలో భద్రపరిచారు. తొలి శస్త్రచికిత్స అనంతరం కోలుకున్న సురేష్‌కు పుర్రెలో ఏర్పడిన క్రానియెక్టమీ డిఫెక్ట్‌ను సరిచేసేందుకు సీనియర్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డా. శ్రీనివాస్ బొట్ల పర్యవేక్షణలో జనరల్ అనస్తీషియా కింద లెఫ్ట్ ఫ్రంటో–టెంపోరో–పెరైటల్ బోన్ ఫ్లాప్ రీప్లేస్‌మెంట్ క్రానియోప్లాస్టీ నిర్వహించారు. పొత్తికడుపులో భద్రపరిచిన బోన్ ఫ్లాప్‌ను తిరిగి అమర్చి టైటానియం ప్లేట్లు, స్క్రూలతో స్థిరపరిచారు. శస్త్రచికిత్స అనంతర కాలం ఎలాంటి సమస్యలు లేకుండా సాగింది. ఫిజియోథెరపీతో పాటు ఐవీ యాంటీబయాటిక్స్, యాంటీఎపిలెప్టిక్స్, అనాల్జెసిక్స్, యాంటీఎమెటిక్స్, పీపీఐలు, ఐవీ ఫ్లూయిడ్స్ తదితర చికిత్స అందించారు. డిశ్చార్జ్ సమయానికి సురేష్ స్పృహలో, పరిసరాలపై అవగాహనతో, వైద్యుల ఆదేశాలకు స్పందించే స్థితిలో ఉన్నారు. వైటల్స్ స్థిరంగా ఉండగా గ్లాస్గో కోమా స్కేల్ ఈ4వీ5ఎం6, అంటే 15/15గా నమోదైంది. శస్త్రచికిత్స చేసిన గాయం కూడా ఆరోగ్యకరంగా ఉండటంతో తదుపరి వైద్య సూచనలతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. డా. శ్రీనివాస్ బొట్ల మాట్లాడుతూ, తీవ్రమైన ట్రామాటిక్ బ్రెయిన్ ఇంజ్యూరీలో మెదడులో రక్తస్రావం, వాపు, మాస్ ఎఫెక్ట్, మిడ్‌లైన్ షిఫ్ట్ వంటి సమస్యలు ఏర్పడినప్పుడు డీకంప్రెసివ్ క్రానియెక్టమీ అవసరమవుతుందని తెలిపారు. ఈ రోగిలో తొలగించిన బోన్ ఫ్లాప్‌ను యాంటీరియర్ అబ్డామినల్ వాల్‌లో భద్రపరిచారని, రోగి కోలుకున్న అనంతరం దానిని తిరిగి అమర్చి టైటానియం ప్లేట్లు, స్క్రూలతో స్థిరపరిచి క్రానియోప్లాస్టీ నిర్వహించినట్లు వివరించారు. శస్త్రచికిత్స అనంతరం రోగి పరిస్థితి స్థిరంగా ఉందని తెలిపారు. తీవ్రమైన తల గాయాల అనంతరం స్పృహ కోల్పోవడం, పదేపదే వాంతులు, తీవ్రమైన తలనొప్పి, సీజర్స్, అధిక నిద్రమత్తు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే న్యూరో వైద్యులను సంప్రదించాలని యశోదా ఆసుపత్రి యాజమాన్యం సూచించింది.తెలంగాణ–పినపాక నియోజకవర్గ ప్రతినిధి–వల్లెపోగు రాము)




**అశ్వాపురం అక్టోబర్ 03:–**

అశ్వాపురం మండల కేంద్రంలోని మంచికంటినగర్ నందు ఆరిఫా,రోషిని అండ్ రీమా వృద్ధాశ్రమం నిర్వహిస్తున్న, నిర్వాహకురాలు శ్రీమతి షేక్.షహనాజ్ బేగం కు అంతర్జాతీయ శాంతి – ప్రతిభ పురస్కారం వరించింది. వంశీ ఈవెంట్స్ అండ్ మోర్ద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన, ఈ అంతర్జాతీయ శాంతి– ప్రతిభ పురస్కారం 2026 ను డిప్యూటీ స్పీకర్ జాటో రామచంద్రం నాయక్ చేతుల మీదుగా శు క్రవారం రాత్రి ఈ అవార్డు అందుకున్నారు. అక్టోబర్ 2 న హైదరాబాద్ , కింగ్ కోటి తిలక్ రోడ్ లో ఉన్న తెలంగాణ సరస్వత పరిషత్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగినది. 15 సంవత్సరాలుగా ,ఆరిఫా, రోషిని అండ్ రీమా వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తూ, ఎంతో మంది అనాథ వృద్ధులకు చేరదీసి, మానవత దృక్పథంతో విశిష్ట సేవలు అందిస్తూ, ఎంతోమంది అనాధ వృద్ధులకు తానే అమ్మలకే అమ్మాయి సకల సౌకర్యాలు అందిస్తూ, కుల మతాలకు అతీతంగా ప్రేమానురాగాలు పంచుతూ, కన్నబిడ్డలే కాదని నిరాదరణకు గురిచేసి జీవితం మీద విరక్తి చెందేలా చేసి చివరికి తమ బ్రతికే భారమై ఎవరిని ఆశ్రయించాలో తెలియని క్షణంలో నేనున్నానంటూ ఆరిఫా రోషిని రీమా వృద్ధాశ్రమ నిర్వాహకురాలు తోడ్పాటున అందిస్తూ, వారికి చేస్తున్న సేవలను, వారిపట్ల చూపిస్తున్న ఓపికకు ఈ శాంతి మరియు ప్రతిభ పురస్కారం అందించడం జరిగినదనీ, డాక్టర్ అండ కేర్ శ్రీనివాస్ ఆశ్రమ నిర్వాహకురాలని శాంతి కొనియాడారు. ఈ కార్యక్రమంలో... డా. వంశీ, డా. శ్రీనివాస్, జర్మన్టన్ హాస్పిటల్ అత్తాపూర్ నిర్వాహకులు,డా. ఇష్తికార్ మరియు నగర పుర ప్రముఖులు ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

# బీఎన్ రెడ్డి పేరే పెట్టాలె..

'గోదావరి నీళ్లను చూసేంతవరకు నిద్రాహారాలు మానేస్తా' ఇది కేవలం రాజకీయ నినాదం కాదుబీ ఉమ్మడి నల్లగొండ జిల్లా కరువు కాటకంలో చిక్కుకున్న లక్షలాది ప్రజల పక్షాన మాజీ ఎంపీ భీంరెడ్డి నరసింహారెడ్డి (బి.ఎన్.రెడ్డి) బలిదానానికి సిద్ధమై చేసిన దీక్ష. ఆయన గుండెల్లో నిప్పులా రగిలిన ఆ పోరాట జ్వాల, ఈరోజు రాజకీయ పన్నాగాల ముందు మసకబారుతుండటం చరిత్రకు సిగ్గుచేటు. బి.ఎన్.రెడ్డి కేవలం ఒక రాజకీయ నాయకుడు కాదుబీ ఆయన ప్రజా జీవితంలో నిబద్ధతకు ఒక పాఠ్యపుస్తకం. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తొలి ఎన్నికల్లో సూర్యాపేట ఎమ్మెల్యేగా మొదలుపెట్టి, నాగారం ఎమ్మెల్యేగా, ఆ తర్వాత మూడుసార్లు (మొత్తం 17 ఏండ్లు) మిర్యాలగూడ ఎంపీగా పనిచేసిన ఆయన ప్రస్థానం సేవకు, పోరాటానికి అంకితం చేయబడింది. తొలి దశ తెలంగాణ ఉద్యమ ప్రభంజనంలోనూ నిలిచి, గెలిచి తనదైన ముద్ర వేసుకున్నారు. తరిమెల నాగిరెడ్డి సభాపక్ష నాయకుడిగా రాజీనామా చేసిన వేళ ఆ పాత్రను భుజాన వేసుకొని ఆయన చేసిన కృషి.. నిజాయితీకి రాజీ లేదని నిరూపించింది. పదవులు తాత్కాలికమని, ప్రజా సమస్యల పరిష్కారాలు శాశ్వతమని నమ్మిన ఆయన.. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) రెండో దశ ద్వారా 4.40 లక్షల ఎకరాలకు నీళ్లు అందించాలనే లక్ష్యాన్ని తన జీవిత పరమావధిగా పెట్టుకున్నారు. పోరాటానికి ప్రామాణికం: నీటి కోసం నెరపిన ప్రజాపోరాటాలు, రాసిన ప్రతిపాదనలు, పత్రాల్లో దాగిన వేదన గోదావరి జలాల సాధనలో ఆయన చేసిన పోరాటం కేవలం సభల్లో మాట్లాడిన మాటలు కాదు, అది అధికారిక పత్రాల్లో, లెక్కల్లో నిక్షిప్తమై ఉంది. ముఖ్యంగా అందులో ఒకదాన్ని పరిశీలిస్తే, 2001 మార్చి 15న నాటి కేంద్రమంత్రి ఎం.వెంకయ్య నాయుడుకి రాసిన లేఖ ఆయన కృషికి తిరుగులేని ఆధారం. 1996లోనే పునాది వేసినా, పనులు మాత్రం 63వ కిలోమీటర్ వద్దే ఆగిపోయాయని, కేంద్ర జల కమిషనర్ గ్రీన్ సిగ్నల్ ఉన్నా, సాంకేతిక అంశాల సాకుతో కావాలనే అధికారులు ఆలస్యం చేస్తున్నారని ఈ లేఖలో ఆయన తన వేదనను వెళ్లగక్కారు. 'గట్టిగా పట్టుబట్టి, దీనికి ఒక తుది రూపం ఇవ్వండి' అంటూ కేంద్ర జోక్యాన్ని కోరిన ఆయన ఆర్తి, ఆ కరువు నేల పట్ల ఆయనకున్న అనుబంధానికి అద్దం పడుతుంది. 'గోదావరి నీళ్లు చూసి తీరుతా' అంటూ దృఢ సంకల్పాన్ని చాటారు. గోదావరి జలాలను 'మా హక్కు'గా సాధించుకునేందుకు ప్రభుత్వంతో, అధికారులతో, అడ్డుపడిన ప్రతి రాజకీయ శక్తితో ఆయన తిరుగులేని పోరాటం చేశారు. ఇటువంటి పోరాటం, త్యాగం చేసిన యోధుడి పేరును పక్కన పెట్టడం చరిత్రకు, ప్రజాస్వామ్యానికి చేసే ద్రోహమే. చరిత్రను తుడిచేస్తున్న రాజకీయ పరాకాష్ఠ: బి.ఎన్.రెడ్డి నిస్వార్థ సేవ, అలసట లేని పోరాట ఫలితాలను అనుభవిస్తున్న నేటి పాలకులు%ౌ% ఆ ఫలాన్ని అందించిన ప్రదాత పేరునే తుడిచిపెట్టాలని చూడటం అత్యంత శోచనీయం. గోదావరి జలాలు రావాలంటే బీఎన్‌రెడ్డికే ఓటు వేయాలని గోడల మీద ఉన్న నినాదాలను చదివానని కేసీఆర్ తిరుమలగిరి సభలో ప్రస్తావించారు. ఈ ప్రాంతమంతా పోరాటాల గడ్డ, ఈ ప్రాంతానికి నీళ్లు రావాలని భీం రెడ్డి తపించారని కేసీఆర్ అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే శ్రీరాంసాగర్ రెండో దశ నుంచి నల్లగొండకు కేసీఆర్ నీళ్లు వదిలిన ఘటనను ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉన్నది. చరిత్ర తెలుసుకోకుండా, కేవలం కార్యకర్తల కరతాళ ధ్వనుల కోసం, అధికారిక పార్టీ మనుగడ కోసం ప్రకటనలు చేస్తూ, చరిత్రను వక్రీకరించడం తెలంగాణ ముఖ్యమంత్రికి తగదు. దశాబ్ద కాలం పాటు ఎమ్మెల్యేగా, పదిహేడేండ్ల పాటు ఎంపీగా ప్రజల కష్టాలు తీర్చేందుకు అంకితమైన ఒక త్యాగమూర్తికి ఇంతకుమించిన అన్యాయం, ఆయన అభిమానులకు అవమానభారం ఇంకొకటి ఉండబోదు. న్యాయాన్ని



నిలబెట్టండి: గోదావరి జలాల కోసం బి.ఎన్. రెడ్డి చేసిన పోరాటాన్ని, ఆయన గుండె కదలికను గౌరవించడం నేటి ప్రభుత్వ నైతిక బాధ్యత. ఈ నేలకు నీళ్లు అందించడానికి ఆయన చేసిన ప్రతి శ్వాస, ప్రతి అడుగూ నేడు మనకు రుణపడి ఉన్నాయి. ఆయన చూపిన మార్గాన్ని, ఆయన చేసిన కృషిని గౌరవించాలంటే%ౌ% గోదావరి జలాల సాధనకు అసలు కారకులైన, నిజమైన ప్రదాత అయిన భీంరెడ్డి నరసింహారెడ్డి పేరు మాత్రమే దీనికి సరైనది. చరిత్రను వక్రీకరించే ఎలాంటి అనైతిక ప్రకటనైనా తక్షణమే ఉపసంహరించుకోవాలి. సుదీర్ఘ కాలం పార్లమెంట్ సభ్యుడైన ఆ మహనీయుడి నిజమైన చరిత్రను గౌరవించి, న్యాయాన్ని నిలబెట్టాలని కోరుకుందాం. నీళ్ల కోసం నిప్పులా పోరాడిన మహనీయుడు బి.ఎన్. రెడ్డి ఆత్మకు శాంతి కలిగించాల్సిన, గౌరవాన్ని ఇవ్వాల్సిన బాధ్యత ఈ సమాజంపైనే ఉన్నది. ఈ పాలకులు జీవోల ద్వారా పేరు కబ్జా పెట్టాలని చూస్తున్నారు కానీ, కేసీఆర్ నీళ్లు పారించిన రోజే తుంగతుర్తి

# మొలకలను ఇంట్లోనే ఇలా సులభంగా తయారు చేయండి..

## వీటిని తినే విషయంలో ఈ జాగ్రత్తలు తప్పనిసరి..!



మన శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకు అనేక బలవర్ధకమైన ఆహారాలు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో మొలకలు కూడా ఒకటి. పెసలు, పల్లీలు, శనగలు తదితర గింజలను నీటిలో నానబెట్టి వాటితో మొలకలను తయారు చేస్తారు. మొలకలు చాలా బలవర్ధకమైన ఆహారంగా చెప్పవచ్చు. కానీ చాలా మంది వీటిని తినేందుకు అంతగా ఆసక్తిని చూపించరు. మొలకలు మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. మొలకలను చాలా మంది సాధారణంగా బయట కొంటుంటారు. కానీ కాస్త శ్రమిస్తే వీటిని ఇంట్లోనే మనం ఎంతో సులభంగా తయారు చేసుకోవచ్చు. మొలకలను తయారు చేసేందుకు పెద్దగా కష్టపడాల్సిన పనిలేదు. అన్ని రకాల గింజలను కొంత మోతాదులో తీసుకుని అన్నింటినీ కలిపి చాలా సులభంగా మొలకలను తయారు చేయవచ్చు.

**మొలకల తయారీ ఇలా..**

ఆయా గింజలను తీసుకుని శుభ్రంగా కడిగి వాటిని ముందుగా 8 నుంచి 10 గంటల పాటు నీటిలో నానబెట్టాల్సి ఉంటుంది. తరువాత వాటిని నీటి నుంచి తీసి శుభ్రమైన వస్త్రంలో ఉంచి చుట్టాలి. అనంతరం వాటిని ఒక పాత్రలో ఉంచి మీద మూత పెట్టాలి. 24 నుంచి 48 గంటల పాటు వేచి చూస్తే ఆ గింజలకు మొలకలు వస్తాయి. తరువాత వాటిని తీసి మళ్లీ కాస్త కడిగి అనంతరం వాటిని తినవచ్చు. ఇలా ఇంట్లోనే సులభంగా మొలకలను తయారు చేసుకోవచ్చు. అయితే మనం ఎంచుకునే గింజలను బట్టి అవి మొలకలుగా మారేందుకు సమయం పడుతుంది.

## పండక్కి ముందే ఘాటెక్కిన ఉల్లి, వెల్లుల్లి
## హైదరాబాద్‌లో నేటి కూరగాయల ధరలు తెలిస్తే




హైదరాబాద్ నగరవాసులకు, ముఖ్యంగా కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన కూరగాయలు అందుబాటులో ఉండే ప్రధాన కేంద్రం కూకట్‌పల్లి రైతుబజార్. మార్కెట్‌లోని తాజా రేట్ల ప్రకారం కిలో టమోటా రూ. 29, వంకాయ రూ. 35, బెండకాయ రూ. 55, పచ్చిమిర్చి రూ. 50గా నమోదు కాగా, ఈ మార్కెట్‌లో నమోదైన తాజా కూరగాయల ధరల వివరాలు ఇలా ఉన్నాయి. పండక్కి ముందే ఘాటెక్కిన ఉల్లి, వెల్లుల్లి..హైదరాబాద్‌లో నేటి కూరగాయల ధరలు తెలిస్తే.. హైదరాబాద్: ఈ రోజుల్లో సామాన్యుడి నుంచి ఉన్నత వర్గాల వరకు ప్రతి రోజు కూరగాయలు కావాల్సిందే. ధరలు ఎంత పెరిగినా ప్రతి రోజు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. కొందరైతే రోజువారీగా మార్కెట్‌కు వెళ్లి కొనుగోలు చేస్తుంటే.. కొందరేమో వారాంతపు సంతలో ఒక్కసారిగా వారానికి సరిపడా కూరగాయలను తీసుకొస్తుంటారు. అయితే వివిధ రకాల కూరగాయల ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకోవడం చాలా ముఖ్యం. ప్రతి రోజు కూరగాయల ధరలు మారుతూనే ఉంటాయి. హైదరాబాద్‌లోని ప్రముఖ కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరల వివరాలు, మార్కెట్‌లోని తాజా రేట్ల ప్రకారం కిలో టమోటా రూ. 29, వంకాయ రూ. 35, బెండకాయ రూ. 55, పచ్చిమిర్చి రూ. 50గా నమోదు కాగా, క్యారెట్ రూ. 45, బీన్స్ రూ. 65 మరియు ఉల్లిగడ్డ రూ. 40 చొప్పున విక్రయిస్తున్నారు. నిత్యావసరాలైన అల్లం కిలో రూ. 120, వెల్లుల్లి రూ. 240, ఎండుమిర్చి రూ. 280 పలుకుతున్నాయి.

## రీచార్జ్ చేసేటప్పుడు ఇక ఆ కష్టం ఉండదు
## టెలికాం కంపెనీలకు ట్రాయ్ కీలక ఆదేశాలు




రీచార్జ్ ప్లాన్ల కోసం వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌లలో వెతకాల్సిన అవసరం లేకుండా టెలికాం కంపెనీలకు ట్రాయ్ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇకపై ప్రీపెయిడ్ రీచార్జ్ విభాగంలో 'ట్రాయ్ నిర్దేశించిన ప్లాన్లు' పేరుతో ప్రత్యేక సెక్షన్ ఏర్పాటు చేసి, దాన్ని మొదటి ఎంపికగా చూపించాలి. ప్రత్యేక విక్రయ కేంద్రాల్లోనూ ఈ ప్లాన్ల వివరాలను ప్రముఖంగా ప్రదర్శించాలి. ఇప్పటికే అందుబాటులో ఉన్న ప్లాన్లను సులభంగా గుర్తించేలా చేయడమే ఈ ఆదేశాల ఉద్దేశం. మొబైల్ రీచార్జ్ చేసేటప్పుడు తమకు కావాల్సిన ప్లాన్ కోసం యాప్‌లో, వెబ్‌సైట్‌లో వెతికి వెతికి విసిగిపోయే వినియోగదారులకు ఇది గుడ్‌న్యూస్. తక్కువ ధరలో ఉండే రీచార్జ్ ప్లాన్లు సులభంగా కనిపించేలా టెలికాం కంపెనీలకు ట్రాయ్ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇకపై ప్రీపెయిడ్ రీచార్జ్ విభాగంలో 'ట్రాయ్ నిర్దేశించిన ప్లాన్లు' పేరుతో ప్రత్యేక సెక్షన్ ఏర్పాటు చేయాలి. అంతేకాదు.. ఆ సెక్షన్‌నే మొదటి ఎంపికగా కనిపించేలా చేయాలి.

మొదట కనిపించాల్సిందే..

టెలికాం కంపెనీల వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌లలో ప్రీపెయిడ్ రీచార్జ్ విభాగాన్ని ఓపెన్ చేసిన వెంటనే 'ట్రాయ్ నిర్దేశించిన ప్లాన్లు' కనిపించేలా చేయాలని ట్రాయ్ స్పష్టం చేసింది. వాటిని ఏదో ఒక విభాగంలో దాచి పెట్టడం లేదా పలు పేజీలు దాటిన తర్వాత కనిపించేలా చేయడం కుదరదు. అలాగే టెలికాం కంపెనీల ప్రత్యేక విక్రయ కేంద్రాల్లోనూ ఈ ప్లాన్ల వివరాలను ప్రముఖంగా ప్రదర్శించాల్సి ఉంటుంది.

వినియోగదారుల ఫిర్యాదులతో..

తమకు అవసరమైన రీచార్జ్ ప్లాన్లను వెబ్‌సైట్లు, యాప్‌లలో సులభంగా గుర్తించలేకపోతున్నామని పలువురు వినియోగదారులు ట్రాయ్‌కు ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా తక్కువ ధరలో ఉండే ప్లాన్ల కోసం అనేక పేజీలు, విభాగాలు వెతకాల్సి వస్తోందని తెలిపారు. ఈ ఫిర్యాదులపై ట్రాయ్ కూడా టెలికాం కంపెనీల వెబ్‌సైట్లు, యాప్‌లను పరిశీలించింది. కొన్ని చోట్ల వినియోగదారులు కావాల్సిన ప్లాన్ చేరుకోవడానికి రెండు, మూడు కంటే ఎక్కువ దశలు దాటాల్సి వస్తున్నట్లు గుర్తించింది. దీంతో వినియోగదారులకు అవసరమైన ప్లాన్లు సులభంగా కనిపించేలా ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని ఆదేశించింది.

ఈ ప్లాన్లు ఏంటి?

ఇక్కడ మరో ముఖ్యమైన విషయం ఉంది. ట్రాయ్ ఇప్పుడు కొత్తగా ఎలాంటి రీచార్జ్ ప్లాన్లను తీసుకురావడం లేదు. ఇప్పటికే నిబంధనల ప్రకారం టెలికాం కంపెనీలు అందించాల్సిన ప్లాన్లను ఒకే చోట సులభంగా కనిపించేలా చేయడమే తాజా ఆదేశాల ఉద్దేశం. టెలికాం కంపెనీలు కనీసం ఒక సాధారణ ప్లాన్, ఒక ప్రత్యేక టారిఫ్ ప్లాన్, ఒక కాంబో ప్లాన్‌ను అందించాల్సి ఉంటుంది. వీటికి 30 రోజుల చెల్లుబాటు ఉండాలి. ప్రతి నెలా ఒకే తేదీన రీచార్జ్ చేసుకునే అవకాశం కూడా ఉండాలి.

## గనిలో జాక్‌పాట్ అదృష్టం అంటే
## వీళ్లదే ఆరు నెలలు తవ్వితే ఒకేసారి 4 వజ్రాలు




మధ్యప్రదేశ్‌లోని పన్నాలో ఝూన్సీకి చెందిన దంపతులకు వజ్రాల గనిలో జాక్‌పాట్ తగిలింది. ఆరు నెలల పాటు కష్టపడి తవ్వకాలు చేయగా, ఒకేసారి 5.16 క్యారెట్ల బరువున్న నాలుగు అరుదైన వజ్రాలు లభించాయి. వీటి అంచనా విలువ సుమారు రూ.12 లక్షలు. ఈ వజ్రాలతో తమ పిల్లల భవిష్యత్తుకు, వ్యాపార విస్తరణకు ప్రణాళికలు వేసుకుంటున్నారు. అదృష్టం తలుపు తడితే ఎలా ఉంటుందో చూపించే ఘటన మధ్యప్రదేశ్‌లోని పన్నాలో చోటుచేసుకుంది. వజ్రాల కోసం ఆరు నెలల పాటు కష్టపడి గనిలో అన్వేషణ సాగించిన ఝూన్సీకి చెందిన దంపతులకు ఒకేసారి నాలుగు అరుదైన వజ్రాలు లభించాయి. ఈ నాలుగు వజ్రాల మొత్తం బరువు 5.16 క్యారెట్లు కాగా.. వాటి అంచనా విలువ సుమారు రూ.12 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఝూన్సీకి చెందిన రాజ్‌కుమార్ శ్రీవాస్, ఆయన భార్య గుడ్డి దేవి పన్నాలోని సర్కోహా ప్రాంతంలో మైనింగ్ లీజు తీసుకుని వజ్రాల కోసం అన్వేషణ ప్రారంభించారు. పన్నాలో వజ్రాలు లభించి సాధారణ ప్రజల జీవితాలు మారుతున్నాయన్న వార్తలను సోషల్ మీడియాలో చూసిన రాజ్‌కుమార్ కూడా వజ్రాల గనిలో అదృష్టాన్ని పరీక్షించుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అలా దాదాపు ఆరు నెలల పాటు దంపతులు గనిలో శ్రమించారు. చివరకు వారి కష్టానికి ఫలితం దక్కింది. తవ్వకాల్లో ఒకేసారి నాలుగు వజ్రాలు లభించాయి. వాటిలో 1.62 క్యారెట్లు, 1.29 క్యారెట్ల బరువున్న రెండు వజ్రాలు మెరుస్తుండగా.. 1.44 క్యారెట్లు, 0.81 క్యారెట్ల బరువున్న మరో రెండు వజ్రాలు కాంతిహీనంగా ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 5.16 క్యారెట్ల వజ్రాలు లభించడంతో ఆ దంపతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. నిబంధనల ప్రకారం లభించిన నాలుగు వజ్రాలను దంపతులు ప్రభుత్వ వజ్రాల కార్యాలయంలో జమ చేశారు. వీటి అంచనా విలువ సుమారు రూ.12 లక్షలు ఉండొచ్చని వజ్రాల నిపుణుడు అనుపమ్ సింగ్ తెలిపారు. అయితే తుది ధర ప్రభుత్వ వేలంలోనే నిర్ణయించనున్నారు. వేలం అనంతరం నిబంధనల ప్రకారం రాయల్టీ, ఇతర ప్రభుత్వ రుసుములు మినహాయించి మిగిలిన మొత్తాన్ని దంపతులకు అందించనున్నారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీర్వాదాలతో పాటు ఆరు నెలల కష్టానికి ఈ వజ్రాలు ఫలితమని ఆనందం వ్యక్తం చేశారు. వేలం ద్వారా వచ్చే డబ్బును పిల్లల చదువుకు, వారి భవిష్యత్తుకు ఉపయోగిస్తామని చెప్పారు. అలాగే తమ వ్యాపారాన్ని విస్తరించేందుకు కూడా కొంత మొత్తాన్ని వినియోగించాలని భావిస్తున్నట్లు తెలిపారు. పన్నా ప్రాంతంలో సాధారణ ప్రజలు గనులకు లీజులు తీసుకుని వజ్రాల అన్వేషణ చేపట్టడం, అదృష్టం కలిసొస్తే విలువైన వజ్రాలు లభించడం తరచూ వార్తల్లో నిలుస్తోంది. తాజాగా ఈ దంపతులకు ఒకేసారి నాలుగు వజ్రాలు దొరకడం స్థానికంగా ఆసక్తిని రేకెత్తించింది.

# మద్యం మత్తులో తెలంగాణ టాప్ మహిళల్లోనూ
# పెరుగుతున్న వినియోగం NFHS-6 షాకింగ్ రిపోర్ట్




జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-6 (NFHS-6) నివేదిక ప్రకారం, తెలంగాణ మద్యం వినియోగంలో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. రాష్ట్రంలో 15 ఏళ్లు పైబడిన పురుషుల్లో 43.9% మంది, మహిళల్లో 7.1% మంది మద్యం సేవిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం అధికంగా ఉంది. మద్యం విక్రయాలు, ఎక్సైజ్ ఆదాయం భారీగా పెరిగాయి, ఇది రాష్ట్రంలో మద్యం వాడకంపై చర్చకు దారితీస్తోంది. మద్యం మత్తులో తెలంగాణ టాప్.. మహిళల్లోనూ పెరుగుతున్న వినియోగం! షాకింగ్ రిపోర్ట్ మద్యం వినియోగంలో తెలంగాణ మరోసారి దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-6 తాజా గణాంకాల ప్రకారం.. రాష్ట్రంలో 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న పురుషుల్లో 43.9 శాతం మంది మద్యం సేవిస్తున్నట్లు వెల్లడైంది. దేశ సగటుతో పోలిస్తే తెలంగాణలో మద్యం వినియోగం గణనీయంగా ఎక్కువగా ఉన్నట్లు సర్వే గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఎన్ఎఫ్‌హెచ్ఎస్-6 ప్రకారం దేశవ్యాప్తంగా 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న పురుషుల్లో మద్యం సేవించే వారి సగటు 18.9 శాతంగా ఉండగా.. తెలంగాణలో ఈ శాతం 43.9గా నమోదైంది. దీంతో పురుషుల్లో మద్యం వినియోగం అధికంగా ఉన్న రాష్ట్రాల జాబితాలో తెలంగాణ మొదటి స్థానంలో నిలిచింది. 42.2 శాతంతో రాజస్థాన్ రెండో స్థానంలో, 38.3 శాతంతో ఛత్తీస్‌గఢ్ మూడో స్థానంలో ఉన్నాయి. జార్ఖండ్‌లో 33.6 శాతం, మధ్యప్రదేశ్‌లో 26.9 శాతం మంది పురుషులు మద్యం సేవిస్తున్నట్లు సర్వే వెల్లడించింది. తెలంగాణలో మద్యం వినియోగం జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉంది. రాష్ట్రంలో 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న మహిళల్లో 7.1 శాతం మంది మద్యం సేవిస్తున్నట్లు ఎన్ఎఫ్‌హెచ్ఎస్-6 గణాంకాలు చెబుతున్నాయి. మహిళల్లో మద్యం వినియోగంలో 19.9 శాతంతో రాజస్థాన్ మొదటి స్థానంలో ఉండగా.. తెలంగాణ 7.1 శాతంతో రెండో స్థానంలో ఉంది. ఛత్తీస్‌గఢ్ 5.7 శాతం, జార్ఖండ్ 5.5 శాతం, మధ్యప్రదేశ్ 1.6 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. తెలంగాణలో మద్యం వినియోగంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య కూడా స్పష్టమైన వ్యత్యాసం ఉన్నట్లు సర్వే పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో 46.6 శాతం మంది పురుషులు మద్యం సేవిస్తుండగా.. పట్టణ ప్రాంతాల్లో ఈ శాతం 36.3గా ఉంది. అంటే గ్రామీణ ప్రాంతాల్లో మద్యం వినియోగం పట్టణ ప్రాంతాల కంటే 10.3 శాతం ఎక్కువగా నమోదైంది. తెలంగాణలో మద్యం వినియోగం అధికంగా ఉండటానికి గ్రామీణ ప్రాంతాల్లోని వినియోగమే ప్రధాన కారణంగా కనిపిస్తోందని సర్వే వివరించింది. మహిళల విషయానికి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో 8.6 శాతం మంది మద్యం సేవిస్తున్నట్లు నమోదైంది. పట్టణ ప్రాంతాల్లో ఈ సంఖ్య 2.8 శాతంగా ఉంది. అంటే మహిళల్లోనూ గ్రామీణ ప్రాంతాల్లో మద్యం వినియోగం పట్టణ ప్రాంతాల కంటే ఎక్కువగా ఉంది. ఇదిలా ఉంటే.. తెలంగాణలో మద్యం వినియోగానికి అనుగుణంగా మద్యం విక్రయాల ఆదాయం కూడా భారీగా పెరిగినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో మద్యం మార్కెట్ ద్వారా సుమారు రూ.40,209 కోట్ల ఆదాయం సమకూరినట్లు నివేదిక పేర్కొంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం 2024-25లో ఈ ఆదాయం సుమారు రూ.37,487 కోట్లుగా ఉంది. అదే సమయంలో 2025-26లో 382.91 లక్షల కేసుల మద్యం విక్రయాలు జరగగా.. 2024-25లో 372.25 లక్షల కేసులు విక్రయమైనట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ్యం విక్రయాల పెరుగుదలకు అనుగుణంగా ఎక్సైజ్ ఆదాయం కూడా పెరిగింది. రాష్ట్రంలో మద్యం విక్రయాల ద్వారా వచ్చే ఎక్సైజ్ ఆదాయం సుమారు రూ.39,368 కోట్లకు చేరినట్లు నివేదిక పేర్కొంది. మొత్తం ఎక్సైజ్ కలెక్షన్లు రూ.44,000 కోట్లను దాటినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. ఒకవైపు తెలంగాణలో మద్యం వినియోగం దేశంలోనే అత్యధిక స్థాయిలో నమోదవుతుండగా.. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో ఈ వినియోగం మరింత ఎక్కువగా ఉండటం సర్వేలో కీలక అంశంగా మారింది. మద్యం వినియోగం, గ్రామీణ-పట్టణ వ్యత్యాసం, అలాగే పెరుగుతున్న మద్యం విక్రయాల ఆదాయం.. తెలంగాణలో మద్యం వినియోగంపై మరోసారి చర్చకు దారితీస్తున్నాయి.

## బంగారం ధరలు భారీగా పడిపోతాయా రూ.1.10
# లక్షల దిగువకు వస్తాయా దీశీటూా అంచనా ఇదే




Gold Price Telugu: బంగారం ధరలు వరుసగా రెండో వారం తగ్గుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలో ధీఅని శీట ాూఎవతీఅఝ కీలక అంచనాను వెల్లడించింది. బంగారం ధర ఔన్స్‌కు 4,000 డాలర్ల దిగువకు, మరింత ఒత్తిడి ఉంటే రూ.1.10 లక్షల కంటే దిగువకు చేరే అవకాశం ఉందని విశ్లేషించింది. Indialo Bangaram Dharalu: బంగారం ధరలు వరుసగా రెండో వారం తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో ఇన్వెస్టర్లలో ఆందోళన పెరుగుతోంది. ఈ క్రమంలో ప్రముఖ బ్యాంకింగ్ సంస్థ బ్యాంక్ ఆఫ్ అమెరికా (దీశీటూా) బంగారం ధరలపై కీలక అంచనాను వెల్లడించింది. ప్రస్తుత ఏడాది నాలుగో త్రైమాసికంలో బంగారం ధర ఔన్స్‌కు 4,000 డాలర్ల దిగువకు పడిపోయే అవకాశం ఉందని బ్యాంక్ అంచనా వేసింది. ధర సుమారు 3,750 డాలర్ల స్థాయికి చేరవచ్చని పేర్కొంది. భారత కరెన్సీలో ఇది సుమారు 10 గ్రాములకు రూ.1.15 లక్షలు అవుతుంది. అయితే భారత్‌లో బంగారం ధరలు డాలర్-రూపాయి మారకం రేటు, దేశీయ మార్కెట్ పరిస్థితులు, పన్నులు తదితర అంశాలపై ఆధారపడి మారుతాయి.

### దీశీటూా వైఖరిలో ఎందుకు మార్పు?

గత రెండేళ్లుగా బంగారంపై సానుకూల అంచనాలు వ్యక్తం చేసిన సంస్థల్లో దీశీటూా కూడా ఒకటి. బంగారం ధర ఔన్స్‌కు 5,000 డాలర్లకు చేరవచ్చని తొలినాళ్లలోనే అంచనా వేసింది. అయితే ఇప్పుడు బ్యాంక్ తన అంచనాల్లో కొంత జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. ప్రధానంగా పెరుగుతున్న ఇంధన ధరలు ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను పెంచే అవకాశం ఉందని దీశీటూా ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ పరిణామం బంగారం ధరలపై ప్రభావం చూపవచ్చని విశ్లేషిస్తోంది.

### రూ.1.10 లక్షల దిగువకు బంగారం వస్తుందా?

మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, ముఖ్యంగా ఇరాన్‌కు సంబంధించిన పరిణామాలను మార్కెట్లు నిశితంగా గమనిస్తున్నాయి. ఈ ఉద్రిక్తతలు దీర్ఘకాలం కొనసాగి, ముడిచమురు ధర బ్యారెల్‌కు 150 డాలర్లకు చేరితే 2027లో బంగారం సగటు ధర ఔన్స్‌కు 3,500 డాలర్ల వద్ద ఉండొచ్చని దీశీటూా విశ్లేషకుడు పేర్కొన్నారు. ఇది భారత కరెన్సీలో సుమారు 10 గ్రాములకు రూ.1.08 లక్షలు అవుతుంది. అయితే ఈ స్థాయిని దీశీటూా తన ప్రధాన (బేస్-కేస్) అంచనాగా పేర్కొనలేదు.

### జనవరిలో రూ.1.55 లక్షల అంచనా

జనవరిలో దీశీటూా బంగారం ఔన్స్ ధర 5,000 డాలర్లకు చేరాలంటే పెట్టుబడిదారుల డిమాండ్ సుమారు 14 శాతం పెరగాల్సి ఉంటుందని పేర్కొంది. అయితే ప్రస్తుతం ఉన్న పెట్టుబడి డిమాండ్ బంగారం ధరను సుమారు 4,000 డాలర్ల స్థాయిలో ఉంచేందుకు సరిపోతుందని బ్యాంక్ చెబుతోంది. 5,000 డాలర్ల స్థాయికి చేరుకోవాలంటే పెట్టుబడి డిమాండ్ మరింత గణనీయంగా పెరగాల్సి ఉంటుందని, ప్రస్తుత భౌగోళిక పరిస్థితుల్లో అది కష్టంగా ఉండొచ్చని దీశీటూా అభిప్రాయపడింది.

### సెంట్రల్ బ్యాంకుల విక్రయాలు మరో రిస్క్

బంగారం ధరలకు మరో ప్రధాన ముప్పు కేంద్ర బ్యాంకుల నుంచి బంగారం విక్రయాలు పెరగడం కావచ్చని దీశీటూా పేర్కొంది. చమురు ధరలు పెరగడం వల్ల ఇంధన దిగుమతులపై ఆధారపడే దేశాల కరెన్సీలు, కరెంట్ అకౌంట్లపై ఒత్తిడి పెరగవచ్చని తెలిపింది. ఈ పరిస్థితుల్లో కొన్ని కేంద్ర బ్యాంకులు తమ ఆర్థిక వ్యవస్థలు, కరెన్సీలకు మద్దతు ఇచ్చేందుకు బంగారాన్ని విక్రయించే అవకాశం ఉందని విశ్లేషించింది. దీశీటూా ప్రకారం, రెండో త్రైమాసికంలో కేంద్ర బ్యాంకులు సుమారు 60 టన్నుల బంగారాన్ని విక్రయించాయి. ఈ విక్రయాల్లో టర్కీ ప్రధానంగా ఉంది. మార్చిలో కూడా కేంద్ర బ్యాంకులు నికర విక్రయదారులుగా ఉన్నాయని బ్యాంక్ తెలిపింది. ఈ విక్రయాలు మరింత పెరిగి, రిటైల్ ఇన్వెస్టర్లు కూడా గోల్డ్ ఐుఖీల నుంచి పెట్టుబడులు ఉపసంహరించుకుంటే, బంగారం ధరలపై మరింత ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉందని దీశీటూా విశ్లేషించింది.

# పైలట్ ధైర్యానికి సెల్యూట్
# స్మిత్ మచ్చార్ కుటుంబానికి భారీ నజరానా




ఫ్లైదుబాయ్ విమానంలో కో-పైలట్ దాడిని ధైర్యంగా ఎదుర్కొని ప్రయాణికులను కాపాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చార్‌కు భారీ గుర్తింపు లభించింది. ఆయన సాహసానికి మాన్‌కైండ్ ఫార్మా రూ.కోటి నగదు బహుమతిని ప్రకటించింది. గాయపడినప్పటికీ, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇచ్చిన మచ్చార్ ధైర్యానికి దేశం సెల్యూట్ చేస్తోంది. ఈ ఘటనపై విచారణ కొనసాగుతోంది.

న్యూఢిల్లీ: ఫ్లైదుబాయ్ ఫ్లీ1073 విమానంలో చోటుచేసుకున్న తీవ్ర ఘటనను అడ్డుకోవడంలో కీలక పాత్ర పోషించిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చార్‌కు భారీ గుర్తింపు లభించింది. ఆయన ధైర్యసాహసాలను ప్రశంసిస్తూ ప్రముఖ ఫార్మాస్యూటికల్ సంస్థ మాన్‌కైండ్ ఫార్మా రూ.కోటి నగదు బహుమతిని ప్రకటించింది. ఈ మొత్తాన్ని కెప్టెన్ మచ్చార్‌తో పాటు ఆయన కుటుంబానికి అందించనున్నట్లు సంస్థ తెలిపింది. సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లీ1073 విమానంలో కాక్‌పిట్‌లో ఇద్దరు పైలట్ల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. సౌదీ, ఇజ్రాయెల్ అధికారుల ప్రకారం.. కో-పైలట్ కెప్టెన్ మచ్చార్‌పై దాడి చేయడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఈ సమయంలో విమానం భారీగా కిందికి దూసుకెళ్లింది. తీవ్ర గాయాలతో ఉన్నప్పటికీ మచ్చార్ కాక్‌పిట్ తలుపును తెరవగలిగారు. దీంతో ప్రయాణికులు, సిబ్బంది లోపలికి చేరుకుని దాడి చేసిన కో-పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విమానాన్ని సౌదీ అరేబియాలోని తబుక్ విమానాశ్రయానికి సురక్షితంగా మళ్లించారు. విమానంలోని ప్రయాణికులు, సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నట్లు ఫ్లైదుబాయ్ అధికారికంగా వెల్లడించింది. ఈ ఘటనపై పూర్తి అధికారిక దర్యాప్తు కొనసాగుతోంది. ఘటన వెనుక కారణాలు, ఉద్దేశాలు దర్యాప్తులో తేలాల్సి ఉందని ఫ్లైదుబాయ్ స్పష్టం చేసింది. కాగా, కెప్టెన్ మచ్చార్ ప్రస్తుతం చికిత్స పొందుతూ కోలుకుంటున్నారని భారత రాయబార కార్యాలయం తెలిపింది. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్ కూడా ఆయనకు ప్రత్యేక శౌర్య పురస్కారం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. మరోవైపు, మచ్చార్ ధైర్యాన్ని ప్రశంసిస్తూ మాన్‌కైండ్ ఫార్మా.. "తన కంటే సిబ్బంది, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇచ్చారు" అంటూ రూ.కోటి బహుమతిని ప్రకటించింది.